# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :10 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 24-02-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఎల్లారెడ్డిలో వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు..

ఎల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని కొందరు వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్ నడిపేవారు అధిక వడ్డీలు వసూలు చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గురువారం ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్, ఎస్సై బొజ్జ మహేష్ పలు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహించారు.దాడుల్లో ప్రామిసరీ నోట్లు ,బ్యాంకు చెక్కులు నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు 36 లక్షలు నగదును సీజ్ చేసినట్లు, ఒకరిపై కేసు నమోదు చేసినట్టు, పలు ఇండ్లలో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని తదుపరి చర్యలు నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని సీఐ తెలిపారు.

## మరో ఘోర రోడ్డు ప్రమాదం..యువ ఎమ్మెల్యే లాస్యనందిత మృత్యువాత




హైదరాబాద్,ఫిబ్రవరి23: మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓయువ మహిళానేత ప్రమాదంలో దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలను ఎదుర్కొంటూ వచ్చిన ఆమెను మృత్యువు జయిస్తూ వచ్చారు. చివరకు మృత్యువే జయించింది. కారు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కన్నుమేశారు. ఎన్నో ఆశలతో తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అసెంబ్లీలో అడుగు పెట్టిన ఆమెను మృత్యువు నిలనీయలేదు. నీవెంటే నేను అంటూ వెంటాడి చంపింది. చివరకు ఏడాదిలోపే తండ్రి దగ్గరకు లాస్య నందిత చేరుకున్నారు. ఇక వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(37) శుక్రవారం తెల్లవారుజామున జరిగిన కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరు ఓఆర్ఆర్ వద్ద ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె పీఏ ఆకాశ్, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఎమ్మెల్యే భౌతిక కాయాన్ని పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. నల్గొండలో భారాస బహిరంగసభకు హాజరై తిరిగి వస్తుండగా నార్కట్‌పల్లి సమీపంలోని చెర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారును ఆటో ఢీకొట్టింది. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది డిసెంబర్‌లో సికింద్రాబాద్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన లాస్య లిఫ్టులో ఇరుక్కుపోయిన సంగతి తెలిపిందే. ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్ట్ కిందకి పడిపోవడంతో అందులో చిక్కుకుపోయారు. ఇలా వరుస ప్రమాదాలు వెన్నాడినా బతికిబయటపడ్డారు. చివరకు జరిగిన ప్రమాదంలో ప్రాణాలు దక్కించుకోలేక పోయారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. గతేడాది ఫిబ్రవరి 19న సాయన్న మృతి చెందారు. ఏడాది కాలంలోనే తండ్రి, కూతురు మృతి చెందడం.. ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. 1987లో హైదరాబాద్‌లో జన్మించిన లాస్య నందిత.. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2015లో రాజకీయాల్లోకి వచ్చారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2016లో సాయన్నతోపాటు భారాసలో చేరారు. 2016-20 మధ్య కవాడిగూడ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2021 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ నుంచి ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. భాజపా అభ్యర్థిపై 17 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అంతలోనే ఆమె మృత్యు ఒడిని చేరడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనతో బిఆర్ఎస్ సమా అధికార, విపక్ష బిజెపి నేతలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. లాస్యనందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నందిత తండ్రి సాయన్నతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. లాస్య నందిత మృతిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అతి పిన్న వయసులో ఎమ్మెల్యేగా ప్రజామన్ననలు పొందారని.. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్ వద్ద కారు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే, ఆమెను ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు వెంటాడాయి. 2 ప్రమాదాల్లో ఆమె బయటపడినా.. మూడోసారి ప్రమాదంలో మృత్యువు కబళించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం 2023, డిసెంబర్ 24న బోయిన్పల్లి వద్ద ఆమె లిఫ్ట్ లో చిక్కుకున్నారు. అక్కడ వీఆర్ ఆస్పత్రి వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం లిఫ్ట్ లో కిందకు దిగుతుండగా అందులో చిక్కుకున్నారు. చాలామంది లిఫ్ట్ లోకి వెళ్లడంతో కొద్దిసేపటికి డోర్ తెరుచుకోలేదు. దీంతో లాస్య నందితతో పాటు పలువురు దాదాపు 3 గంటలు అందులోనే చిక్కుకుని ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ డోర్ బద్దలుకొట్టి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 13న నల్గొండలో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో లాస్య నందిత పాల్గొన్నారు. సభ అనంతరం తిరిగి హైదరాబాద్ వస్తుండగా నార్కట్పల్లి సమీపంలోని చర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. అదే వేగంతో వెళ్లి ట్రాఫిక్ నియంత్రిస్తున్న హోంగార్డులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే తలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో హోంగార్డుకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో లాస్య నందితతో పాటు ఆమె సోదరి, ఇద్దరు గన్ మెన్లు ఉన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న లాస్య నందిత తన సోదరితో కలిసి మరో కారులో హైదరాబాద్ చేరుకున్నారు. నల్గొండ ప్రమాదం జరిగిన 10 రోజుల తర్వాత శుక్రవారం లాస్య నందితను మరో కారు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. గత ప్రమాదం తర్వాత ఆమె కొత్త కారు కొన్నట్లు సమాచారం. గురువారం సదాశివపేటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన లాస్య నందిత తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున పటాన్ చెరు ఓఆర్ఆర్ సమీపంలో రెయిలింగ్ ను ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఆమె పీఏ, డ్రైవర్ అయిన ఆకాశ్ తీవ్రంగా గాయపడగా.. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిద్రమత్తు, అతి వేగమే కారు ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. 1987లో హైదరాబాద్ లో ఆమె జన్మించారు. కంప్యూటర్ సైన్స్ లో బీటెక్ పూర్తి చేశారు. గతేడాది, ఫిబ్రవరి 19న లాస్య నందిత తండ్రి సాయన్న మృతి చెందారు. అనంతరం ఈ టికెట్ కోసం స్థానిక నేతలు కొందరు గట్టిగా ప్రయత్నించినా.. మాజీ సీఎం కేసీఆర్ సాయన్న కుమార్తె నందితపైనే నమ్మకం ఉంచారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ తరఫున కంటోన్మెంట్ నుంచి పోటీ చేసి.. బిజెపి అభ్యర్థిపై 17,169 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడాది వ్యవధిలోనే తండ్రీకుమార్తె మృతితో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. కంటోన్మెంట్ ప్రాంతంలో విషాదం నెలకొంది.

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను రెండు రోజుల్లో అరెస్ట్ చేయబోతున్నారు

న్యూఢిల్లీ, ఢిల్లీ ముఖ్యమంత్రి (ఢిల్లీ సిఎం) అరవింద్ కేజ్రీవాల్ (అరవింద్ కేజ్రీవాల్)ను మరో రెండు, మూడు రోజుల్లో అరెస్ట్ చేయబోతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత, మంత్రి సౌరభ్ భరద్వాజ్ (సౌరభ్ భరద్వాజ్) శుక్రవారం చెప్పారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఖరారైన నేపథ్యంలో బీజేపీ ఈ చర్యకు దిగబోతోందని చెప్పారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయబోతున్నారని బీజేపీ వర్గాల నుంచి తమకు సమాచారం ఉందని.కాంగ్రెస్‌తో పొత్తు కుదిరితే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తారనే సందేశాలు వస్తున్నాయని సౌరభ్ భరద్వాజ్ ఈ సందర్భంగా చెప్పారు. మరో రెండు లేదా మూడు రోజుల్లో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసేందుకు ఈడీని బీజేపీ రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. 'మరో 2-3 రోజుల్లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం మాకు ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇంత తొందరపాటు ఎందుకు చూపుతుందనేదే ప్రశ్న. కాంగ్రెస్‌తో పొత్తు కుదిరితే కేజ్రీవాల్‌ను జైలులో పెట్టడం ఖాయమని బీజేపీకి చెందిన నేతలు చెప్పారు. అలా జరగకూడదంటే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకపోవడమే మంచిదని బీజేపీ వాళ్లు చెబుతున్నారు' అని సౌరభ్ భరద్వాజ్ కలిగి ఉన్నారు. ఆప్-కాంగ్రెస్ పొత్తు నేపథ్యంలో బీజేపీ భయపడుతోందని. అందుకే ఇలాంటి కుట్ర పన్నుతోందని ఆయన చెప్పారు.




ఢిల్లీలో ఆప్-కాంగ్రెస్ పొత్తు ఖరారు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ మధ్య పొత్తు ఖరారైన విషయం తెలిసిందే. ఢిల్లీలో పాలక ఆప్ నాలుగు స్థానాల్లో, కాంగ్రెస్ మూడు స్థానాల్లో పోటీ చేసేందుకు అంగీకారం కుదిరింది. ఢిల్లీలో ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైన గుజరాత్, గోవా,హరియాణ రాష్ట్రాల్లోనూ పొత్తు దిశగా చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలిసింది.ఇరు పార్టీల మ ధ్య ప లు రాష్ట్రాల్లో పొత్తుపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## వన దేవతలను దర్శించుకున్న గవర్నర్ తమిళి సై



మేడారం:మేడారం మహాజాతరలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొన్నారు. ఇవాళ మేడార జాతరకు వెళ్లిన గవర్నర్ సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వనదేవతలకు స్వర్ణం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గవర్నర్ తో పాటు కేంద్ర మంత్రి అర్జున్ ముండా కూడా సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకున్నారు.భారతదేశంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యంగా గిరిజనులు ఐక్యంగా ఉండి సంతోషంగా ఉండాలని వన దేవతలను మొక్కుకున్నట్లు గవర్నర్ తన మనసులో మాటను బయటపెట్టారు. గవర్నర్ హోదాలో ఇప్పటి వరకు మేడారం మూడు సార్లు సందర్శించి అమ్మవార్లను దర్శించి మొక్కులు అప్పచెప్పడం అదృష్టంగా భావిస్తున్నట్లు తమిళసై అన్నారు. గిరిజనులను అభివృద్ది చేయాలనే తనకున్న బలమైన కోరికతో ఇక్కడి 6 గిరిజన గ్రామాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు.

### దేశంలోనే అతి పెద్ద ఆదివాసీ జనజాతర మేడారం: కేంద్ర మంత్రి అర్జున్ ముండా

దేవంలోనే అతి పెద్ద గిరిజన జాతర మేడారమని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా అన్నారు. మేడారంలో వన దేవతలను దర్శించుకుని మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులు తెలంగాణతో పాటు చత్తీస్ గఢ్ రాష్ట్రంలో గిరిజనులు ఎక్కువగా ఉంటారని రెండు రాష్ట్రాల ఆదివాసులకు మేడారం వరమని ఆయన అన్నారు. మేడారాన్ని ట్రైబల్ ఫెస్టివల్ జాతరగా జరిపేందుకు ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అంతకు ముందు కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, గవర్నర్ తమిళిసై శుక్రవారం ఉదయం హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. వీరికి మంత్రి సీతక్క, ఈటెల రాజేందర్, జిల్లా కలెక్టర్, త్రిపాఠి ఘనస్వాగతం పలికారు. అనంతరం వనదేవతల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ అక్కడ బంగారాన్ని సమర్పించారు.

## దీదీతోనూ కాంగ్రెస్ డీల్ ఓకే.. బెంగాల్ లో హస్తంకు ఐదు సీట్లు

డిల్లీ : ఆప్ , సమాజ్ వాదీ పార్టీతో సీట్ల సర్దుబాటు చేసుకున్న కాంగ్రెస్ తాజాగా బెంగాల్ లోని తృణమూల్ కాంగ్రెస్ తో సైతం ఒప్పందం కుదుర్చుకుంది.. గతంలో బెంగాల్ లో ఒంటరిగానే పోటీ చేస్తామన్న మమతా బెనర్జీ తన పంతాన్ని వీడారు. సీట్ల షేరింగ్ పై చర్చలు తుదిదశకు చేరాయి. బెంగాల్‌లోని 42 సీట్లు ఉన్నాయి. ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయాలని భావిస్తోంది. కాగా.. ఐదు సీట్ల వరకు పోటీ చేసేందుకు మమతా అంగీకారం తెలిపింది. దీనికి ప్రతిగా అసోంలో రెండు, మేఘాలయాలో ఒక సీటు ఇవ్వాలని తృణమూల్ కోరింది.. దీనికి రాహుల్ గాంధీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.బెహ్రాంపూర్, మాల్దా సౌత్, మాల్దా నార్త్, రాయ్‌గంజ్, డార్జిలింగ్, పురులియా ప్రాంతాల్లో కాంగ్రెస్ పోటీ చేయాలని భావిస్తోంది. అయితే పురులియా ఇచ్చేందుకు టీఎంసీకి నో చెప్పింది.. మరో సీటు ఇవ్వాలనే కాంగ్రెస్ ప్రతిపాదనను పరిశీలిస్తామని మమతా బెనర్జీ హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నేతలు అంటున్నారు..



## ఇసుక దోపిడీపై ఉమ్మడి ఆందోళనలు చేస్తాం



అమరావతి: వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీ ఉచితంగా ఇచ్చిన ఇసుకను రద్దు చేసి,ఇసుక మాఫియాతో జత కట్టిన జగన్ రెడ్డి అయిదేళ్లల్లో రూ. 50 వేల కోట్లు లూటీ చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు.రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని అక్రమ తవ్వకాల ఫోటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు,తదితర ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వం పర్యావరణ,అటవీ మంత్రిత్వ శాఖ,ఎన్జీటీ నిర్ధారించినా జగన్ రెడ్డి ఇసుక దోపిడీని ఆపటం లేదని తీవ్రంగా ఆరోపించారు.రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతల కనుసన్నల్లో 500కు పైగా రీచ్ ల్లో అక్రమంగా ఈసీలు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్నారు.అక్రమ ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో శనివారం 175 నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ఆందోళనలు చేపట్టినట్టు అచ్చెన్నాయుడు తెలిపారు.

### లాస్యనందిత మృతి తీరని లోటు

హైదరాబాద్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లాస్య ఇక లేరనే అత్యంత విషాదకరమైన, షాకింగ్ న్యూస్ తెలుసుకున్నానని చెప్పారు. దాదాపు వారం క్రితమే ఆమెను పరామర్శించానని, అంతలోనే మళ్లీ ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమని అన్నారు.

## పవన్ ఆశలపై షర్మిల నీళ్లు!

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో మరో కొత్త పొత్తు పొడిచింది. ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య పొత్తు దాదాపు ఖరారైంది. ఇప్పుడు ఇదే కోవలో కాంగ్రెస్ పార్టీ సీపీఎం, సీపీఐల మధ్య పొత్తు పొడిచింది. వచ్చే ఎన్నికల్లో ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం నేతలు వెంకటేశ్వరరావు, గఫూర్ సమావేశమై పొత్తులపై నిర్ణయించారు. కాగా కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల కూటమితో టీడీపీ, జనసేన కూటమికి ఎదురుకాదని అంటున్నారు. ఏపీలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలదని.. ఎట్టి పరిస్థితుల్లో చీలనివ్వబోనని జనసేనాని పవన్ కళ్యాణ్ మొదటి నుంచీ చెబుతూ వస్తున్నారు. ఇందులో భాగంగా టీడీపీకి స్నేహహస్తం చాచారు. ఇంకా బీజేపీ అగ్రనాయకత్వంతో చీవాట్లు తిని మరీ వారిని పొత్తుకు ఒప్పించాను. అయితే ఇప్పుడు షర్మిల కోసం ఏపీ కాంగ్రెస్ పార్టీ.. సీపీఐ, సీపీఎంలతో పొత్తు పెట్టుకోవడంతో కొంత ఓటు బ్యాంకును ఈ కూటమి చీల్చుకుంటే టీడీపీ, జనసేన కూటమికి నష్టం తప్పదనే అంచనాలు ఉన్నాయి. ఏపీలో కాంగ్రెస్ పార్టీకి అంత బలం లేకపోయినా కమ్యూనిస్టు పార్టీలకు ఉద్యోగ, కార్మిక సంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీతో పొత్తు నేపథ్యంలో ఉద్యోగ, కార్మిక, కూలీ సంఘాలు ఈ కూటమి వైపు మొగ్గితే వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుంది. అప్పుడు వైసీపీకే మేలు చేకూరుతుందని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వబోనని చెబుతున్న టీడీపీ, జనసేన కూటమికి నష్టం జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. నిజానికి సీపీఐ, సీపీఎం పార్టీలు... టీడీపీ, జనసేన కూటమితో కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలని భావించారు. అయితే టీడీపీ, జనసేన.. తమతో బీజేపీని కలుపుకోవడానికి నిర్ణయించుకోవడంతో కమ్యూనిస్టు పార్టీలు.. కాంగ్రెస్ వైపు మొగ్గుచూపాయి. మరోవైపు సీబీఐ మాజీ జైంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ నిషేధానికి జై భారత్ నేషనల్ పార్టీ కూడా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో చేరే అవకాశం ఉండొచ్చని అంటున్నారు. ఇప్పటివరకు లక్ష్మీనారాయణ ఈ దిశగా ప్రకటన చేయలేదు. అలాగే రామచంద్ర యాదవ్ చట్టాన్ని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ కూడా కాంగ్రెస్ కూటమితో చేరితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవచ్చని అంటున్నారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూడా కాంగ్రెస్‌తో చేరితే కాంగ్రెస్ కూటమి బలం కొంత పెరుగుతుందని అంటున్నారు. కడపలో చంద్రబాబు చేయిస్తున్న సర్వేలతో



గందరగోళం అంతిమంగా కాంగ్రెస్ కూటమి ఎంత బలపడితే అంతగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవచ్చని అంటున్నారు. దీనివల్ల టీడీపీ, జనసేన కూటమికి నష్టం కలుగుతుందని, వైసీపీకి లాభం కలగొచ్చని. ఫిబ్రవరి 26న కాంగ్రెస్ పార్టీ అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని తలపెట్టింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పాల్గొన్నారు. ఈ సభకు కమ్యూనిస్టు పార్టీల నేతలు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సభ తర్వాత మూడు పార్టీలు కూటమిని బలోపేతం చేసే చర్యలపై దృష్టి సారిస్తారని సూచిస్తుంది.

### ప్రభుత్వ లాంఛనాలతో లాస్య అంత్యక్రియలు

హైదరాబాద్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లాస్య నందిత మృతి బాధాకరమని మంత్రి చెప్పారు. ప్రమాద సమయంలో ఆమె సీట్ బెల్ట్ పెట్టుకోలేదని పోలీసులు చెప్పారని వెల్లడించారు. లాస్య నందిత మృతదేహానికి గాంధీ దవాఖానలో పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం కార్ఖానాలోని నివాసానికి ఆమె పార్థివదేహాన్ని తరలించారు. ఈస్ట్ మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో లాస్య నివాసానికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు.

## సంపాదకీయం

**శనివారం 24-02-2024**

# మోడీ విదేశాంగ విధానంతో అద్భుతాలు !

ఇటీవల ఓ అద్భుతం జరిగింది. ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణలపై ఉరిశిక్షను తప్పించుకున్న జైలు పాలయిన 8మంది నేవీ అధికారులు అనూహ్యంగా స్వదేశం చేరుకున్నారు. ఇది ఎంత అద్భుతం అంటే మాటల్లో చెప్పలేం. దీనికి ప్రధాని మోడీ చేసిన కృషి అమోఘమనే చెప్పాలి. ఎందుకంటే ఉరిశిక్ష పడ్డవారిని జైలుశిక్షకు రప్పించారు. అక్కడి నుంచి ప్రభుత్వ క్షమాభిక్షతో విడుదల చేయించగలిగారు. ఇదంతా మోడీ ఛరిష్మాతో పాటు..విదేశాంగ విధానంలో భారీ విజయంగా చూడాలి. విదేశాంగ విధానంలో అనుసరించే వ్యూహాలు ఇలాంటి అద్భుతాలను ఆవిష్కరిస్తాయి. కరోనా తరవాత మన విదేశాంగ విధానం పూర్తిగా మారిపోయింది. ఇతర దేశాలకు ఆపన్న హస్తం అందించేలా మోడీ నిర్ణయాలు ఉంటున్నాయి. దుబాయ్‌లో అఁరధామ్ నిర్మించడం కూడా ఓ విజయంగానే చెప్పకోవాలి. ఇరుగుపొరుగు దేశాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే..సర్వస్వతంత్రంగా మనగలగాలి. స్వాతంత్య్రా నంతరం మనం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. అమెరికా వైపా..రష్యా వైపా అన్న గీతలు ఉండేవి. ఇప్పుడా గీతలు చెరిగి పోయాయి. మనం బలంగా ఉంటూనే..అందరికి అందుబాటులో ఉండాలన్న ఓ మహత్తర మంత్రాన్ని మోడీ చేపట్టారు. అన్ని దేశాలు కూడా భారత్‌లో దోస్తీ చేసేలా చేస్తున్నారు. ఒక్క పాక్, చైనాలు తప్ప మిగతా ప్రపంచం అంతా ఇదే ధోరణితో సాగుతున్నది. నిజానికి మోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకు అండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించు కునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల తోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి క్లళెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకుండా చేయడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణామాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు ఆయనకు బలంగా లభించాయని స్పష్టం అవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ – అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి. ఉగ్రవాదం, ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం, ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికి అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మస్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. మరింతమందికి అమెరికా వెళ్లేందుకు వీసా నిబంధనలు సడలాలని సగటు భారతీయులు కోరుకుంటు న్నారు. అమెరికాలో అణు ఇంధన రంగం నుంచి కమ్యూనికేషన్, ఆరోగ్య రంగాల్లో భారతీయులే కీలక పాత్ర పోషిస్తుండడం మనకు గర్వకారణం. ఇదంతా అంతర్జాతీయంగా భారత్ శక్తి, ప్రాధాన్యత పెరిగిందనడానికి సంకేతంగా నిలుస్తుంది. రానున్న కాలంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ నిర్వహించబోయే కీలక పాత్రకు తాజాపరిణామాలు ఊపునిస్తున్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా, చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతిపెద్ద వినియోగ మార్కెట్,బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో ఆధునిక కాలానికి సంబంధించిన సవాళ్లను 5జీ టెక్నాలజీ ద్వారా ఎదుర్కొనేందుకు భారత్ సంసిద్ధమవుతున్నది. టెక్నాలజీ రంగంలో అమెరికాకు సాటి రాగలిగిన దేశం లేదని మనకు తెలుసు. పసిఫిక్ మహా సముద్రంలో ఇరు దేశాల నౌకాదళ విన్యాసాలు, ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ కూడా మన రక్షణ పాటవం పెరిగేందుకు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. ఇలా విదేశాగ విధానంలో పటిష్టంగా ఉండడంలో మోడీ నాయకత్వ ప్రతిభను ప్రస్తుతించాల్సిందే.

# వీధికుక్కలకు తోడు కోతుల బెడద..రాష్ట్రంలో ప్రధాన సమస్యలు



హైదరాబాద్,రాష్ట్రంలో వీధికుక్కల, కోతుల దాడులతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ రెండు కూడా అతిపెద్ద సమస్యగా మారయి. కోతుల కారణంగా ఊళ్లల్లో ఇంట్లో పెరట్లో పాదులు వేసుకోవడం కూడా ప్రజలు మానేశారు. పెరటితోటలు పెట్టడం లేదు. ఇళ్లల్లో చెట్లు పెంచడం లేదు. ఇంటిని ఆనుకుని ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు. ఇవివుంటే...ఎక్కడ కోతులు వచ్చి వాలుతాయోనని భయపడుతున్నారు. అలాగే ఇళ్లకు గేట్లు బిగించారు. ఈ సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. పదేళ్ల పాలనా కాలంలో కోతులను అడవులకు తరలించడం ఎలా అన్న ఆలోచన చేయలేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడం..తరవాత మిన్నకుండడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. అగ్నిప్రమాదాలు , బస్సుల ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, కాలువల్లో కొట్టుకు పోవడం, వీధికుక్కల బారిన పడడం, కోతులు దాడివంటి అనకానేక ప్రమాదాల సందర్భంగా జరుగుతున్న తీరు ఇందుకు నిదర్శనంగా చూడాలి. ప్రమాదాలు జరగ్గానే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం, మళ్లీ మరచి పోవడం..జరుగుతోంది. యథారాజా తథా ప్రజ అన్న చందంగా అధికారుల తీరు ఉంటోంది. అధికారులు అప్పటికప్పుడు హడావిడి చేయడం తప్ప మరోటి కానరావడం లేదు. ఎపిలో గ్యాస్ లీక్ ప్రమాదాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఒక అగ్ని ప్రమాదం తరవాత అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైదరాబాద్ నగరంలో కుక్కల దాడులు వరుసగా చూస్తున్నాం. నాలాల్లో పడి కొట్టుకుపోవడం చూస్తున్నాం. ఇవన్నీ నిర్మూలించదగ్గవే అయినా అధికారుల అలసత్వం కారణంగా అడుగు పడడం లేదు. ప్రధానంగా కుక్కల దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. కుక్కల నిర్మూలనలో అధికారుల నిర్లక్ష్యం తప్ప మరోటి కాదు. ఇదిలావుంటే నగరంలో దాదాపు 4 లక్షల 61 వేల కుక్కలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే వీటికి తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా మరో ఐదు లక్షలు ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉంటాయని తెలుస్తోంది. ఇందులో జర్మన్ షెఫర్డ్, డాబర్మెన్ లాంటిలాంటి భయంకరమైన కుక్కలు కూడా ఉన్నాయి. ఈ కుక్కలన్నీ వీధుల్లో తిరుగుతూ..సామాన్య ప్రజలకు భయ భ్రాంతులను కలిగిస్తున్నాయి. అలాగే కుక్కల దాడితో ప్రమాదాలు జరుగతున్న ఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు చేస్తున్న ఖర్చు వల్ల ప్రభుత్వ ఖజానా గుల్ల అవుతోందే తప్ప లక్ష్యం నెరవేరడం లేదని హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె. కాశీనాథ్ అన్నారు. దాడులు చేసి వీధి కుక్కలు బాలలను చంపిన ఘటనలు ప్రభుత్వ బాధ్యారాహిత్యానికి పరాకాష్టగా చూడాలి. గతంలో ఇలాంటి ఘటనలు ఉన్నాయి. కుక్కలు పరుగెత్తుకుని వస్తున్న సందర్భాల్లో టూవీలర్‌పై పోతూ కిందపడి దెబ్బలు తాకిన వారు, ప్రమాదాలకు గురయిన వారు అనేకులు ఉన్నారని కాశీనాథ్ అన్నారు. అలాగే నడకదారిలో ఇవి అడ్డగించి కరుస్తున్న కేసులు అనేకం ఉన్నాయన్నారు. పిల్లలు వీధుల్లో లేదా పార్కుల్లో స్వేచ్ఛగా ఆడుకునే పరిస్థితి నగరంలో లేదన్నారు. మహిళలు, వృద్దులు ధైర్యంగా రోడ్డుపై అడుగు పెట్టకుండా కుక్కలు అడ్డుకుంటు న్నాయని కాశీనాథ్ ఆవేదన చెందారు. ఇకపోతే వీధికుక్కలకు తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా రోడ్లపైనే మలమూత్రాలు పోయడం వల్ల వీధులు ఖరాబు అవుతున్నాయని, వాటిని క్లీన్ చేయడం పారిశుధ్య సిబ్బందికి కూడా సమస్యగా ఉందన్నారు. కొందరు పెద్దపెద్ద విదేశీ కుక్కలను పెంచడం వల్ల కూడా అరుపులు, భయాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. కుక్కల పెంపకందారులు నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే వాటిని మలమూత్రాలకు వదిలేస్తున్నారని అన్నారు. కుక్క పెంటను ఎత్తిపోయడం అన్నది యజమానుల బాధ్యత అయినా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. పెట్ డాగ్స్‌కు లైసెన్స్ తప్పనిసరి చేసి, నిబంధనల మేరకు పెంచుతున్నారా అన్నది కూడా చూడాలని కాశీనాథ్ కోరారు. కుక్కల కోసం నగర శివార్లలో షెల్టర్లు ఏర్పాటు చేసి, స్టెరిలైజ్ చేయడం వల్ల మంచి ఫలితాలతో పాటు డాగ్ లవర్స్‌కు కూడా వాటిని రక్షించుకునే అవకాశం వస్తుందన్నారు. అయినతే నగరంలో ఉన్న వీధికుక్కల్లో 75 శాతం కుక్కలు అంటే 3 లక్షల20 వేల కుక్కలకు స్టేరిలైజేషన్ పూర్తి చేశామని బల్దియా వెటర్నరీ ఆఫీసర్లు చెబుతున్నారు. బల్దియాతో పాటు 5 ప్రైవేట్ ఏజన్సీలతో ఒక్కో కుక్కకు రూ.1500 ఖర్చు చేస్తోన్నట్టు అధికారులు అంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 5 యానిమల్ కేర్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజూ 200 కుక్కలకు ఆపరేషన్ చేయిస్తున్నామని వెల్లడించారు. కంప్లయింట్ వచ్చిన చోటకు వెళ్లి కుక్కను తీసుకు వచ్చి ఆపరేషన్ చేస్తున్నం చేస్తున్నామని చెప్పారు. కుక్కల కోసం ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన యానిమల్ కేర్ సెంటర్ చాలా అద్భుతంగా ఉందని, అలాంటిది దేశంలోనే ఎక్కడా లేదని బల్దియా స్పష్టం చేసింది. కుక్కలకు ఆపరేషన్ చేసిన తర్వాత వాటి చెవికి ఒక మరక పెడతామని, ఆపరేషన్ పూర్తయ్యాక కుక్కలో ముందు ఉన్న ఆ కోపం, ఆవేశం ఉండవని –వెటర్నరీ అధికారులు చెబుతున్నారు. ఎండాకాలంలో చాలా కుక్కలకు చిరాకుతో దాడి చేసే అవకాశం ఉంటుందంటున్నారు. గతంలో కుక్క కరిచి బాలుడు చనిపోతే.. ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం కేవలం సారీ చెప్పి చేతులు దులుపుకుందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిగా ఉన్న నేటి సిఎం రేవంత్ ఆరోపించారు. కనీస సానుభూతి చూపని రాక్షస ప్రభుత్వం ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరంలో కుక్కల బెడద నివారణకు కార్యాచరణ రూపొందించాల్సన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. అలాగే కోతుల నిర్మూలనకు కూడా పెద్ద ఎత్తున కార్యాచరణ చేయాల్సి ఉంది.

# హైతీ అధ్యక్షుడు హత్య కేసులో షాకింగ్ విషయాలు

న్యూఢిల్లీ: రేబియన్ దీవుల్లో మూడో అతిపెద్ద దేశమైన హైతీ అధ్యక్షుడు జోవెనెల్ మొయిజ్ హత్య కేసులో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. 2021 జూలైలో ప్రెసిడెంట్ జోవెనెల్ మొయిజ్ హత్య చేయబడ్డారు. ఆయన హత్యకు ఆయన భార్య మార్టినె మొయిజ్, మాజీ ప్రధాన మంత్రి క్లాడ్ జోసెఫ్ కుట్ర పన్నారని ఆధారాలున్నట్లు హైతీ కోర్టు తెలిపింది. ఈ హత్య కేసు డాక్యుమెంట్లు మీడియాలో లీక్ కావడంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రెసిడెంట్ జోవెనెల్‌ని కొంతమంది కొలంబియాకు చెందిన కిరాయి హంతకులు జూలై 7 2021 రాత్రి ఆయన ఇంట్లోకి ప్రవేశించి హత్య చేశారు. ఈ ఘటనలో ప్రెసిడెంట్ భార్య కూడా గాయపడినట్లు ఆ సమయంలో స్థానిక మీడియా తెలిపింది. జోవెనెల్‌ని హత్య చేసి.. ఆయన స్థానంలో ప్రెసిడెంట్ పదవి చేపట్టడానికి ఆయన భార్య ఈ హత్య చేయించదని న్యాయమూర్తి వాల్టర్ వెస్సర్ కేసు విచారణ సమయంలో చెప్పారు. కేసు విచారణ సమయంలో వేర్వేరు సందర్భాల్లో ఆమె ఇచ్చిన వాంగ్మూలం పరస్పర విరుద్ధంగా ఉండడంతో ఆమెపై అనుమానం కలిగిందని కేసు డాక్యుమెంట్స్‌లో ఉంది. ఆ తరువాత సాగిన విచారణలో ప్రధాన మంత్రి క్లాడ్ జోసెఫ్, మాజీ పోలీస్ డైరెక్టర్ జెనెరల్ లియోన్ చార్లెస్ కూడా ప్రెసిడెంట్ హత్య కుట్రలో భాగంగా ఉన్నారని తెలిసింది. ప్రెసిడెంట్ జోవెనెల్ హత్య కేసులో ఇప్పటివరకు దాదాపు 50 మందిని హైతీ పోలీసులు అరెస్టు చేశారు. అమెరికాలోని మియామీలో హైతీ ప్రెసిడెంట్ హత్య కేసు విచారణ ప్రత్యేకంగా సాగుతోంది. ఈ హత్యకు కుట్ర అమెరికాలోని మియామీలో జరిగిందని ఆధారాలుండడంతో అమెరికా ప్రభుత్వం దీనిపై సీరియస్ అయింది. పైగా దక్షిణ అమెరికా దేశమైన కొలంబియా మాజీ సైనికులే ఈ హత్య చేశారు.ప్రెసిడెంట్ జోవెనెల్ హత్య తరువాత 2021 నుంచి హైతీలో ఎన్నికలు జరగలేదు. ఆ దేశంలో ప్రత్యక్షంగా ఎలాంటి ప్రభుత్వం లేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం లేదు. హైతీ రాజధానిలో విచ్చలవిడిగా క్రిమినల్ గ్యాంగ్స్ ఉండడమే దీనికి కారణం. ఆ క్రిమినల్ గ్యాంగ్స్ వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయి. ప్రస్తుతం హైతీలో ఈ క్రిమినల్ గ్యాంగ్స్ రాజ్యమేలుతున్నాయి. కేవలం 2023లోనే ఈ గ్యాంగ్స్ 4800 మందిని హత్య చేసినట్లు ఐక్యరాజ్యసమితి నివేదిక తెలిపింది. వీరిని అడ్డుకునేందుకు కెన్యా దేశ పోలీసుల సహాయంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని మిలిటరీ బలగాలు త్వరలోనే రంగంలో దిగనున్నాయి.

# పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం కసరతు



హైదరాబాద్,అటు నుంచి నరుక్కు వద్దాం అన్న రీతిలో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొదపెడాతమన్న రీతిలో రాజకీయాలు ఉండబోతున్నాయి. ఆ పార్టీని లేవకుండా చేయాడమే ప్రధాన వ్యూహంగా రాజకీయం నడుస్తోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో మూడో అబ్యర్థిగా పోటీ పెట్టాలన్న ఆలోచన ఉన్నా కాంగ్రెస్ ఎందుకనో మిన్నకుంది. బిఆర్ఎస్‌కు ఛాన్స్ ఇచ్చింది. వద్దిరాజు ఎంపిగా గెలుపొందారు. అవసరాన్ని బట్టి ఎంపిలు, ఎమ్మెల్యేలు ఎప్పుడైనా అధికార పార్టీలో చేరడం ఖాయం. తాజా రాజకీయాల్లో అధికారంలో లేకుండా ఉండలేకపోతున్నారు. అధికార పార్టీలో ఎప్పుడు దుంకుదామా అన్న ఆత్రుతతో ఉన్నారు. అయితే గతానికి భిన్నంగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. చాలా దూకుడుగా ఉండే సిఎం రేవంత్ రెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వెంటనే ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఎందుకంటే వారు ఎప్పుడైనా పార్టీలో చేరుతారు. అందుకే జాగ్రత్తగా వెళుతున్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకునేలా చేస్తున్నారు. ఎందుకంటే రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే గ్రామస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుంది. ఇదే వ్యూహంతో సిఎం రేవంత్ ఇప్పుడు ముందుకు సాగుతున్నారు. అందుకే కాంగ్రెస్ క్షేత్రస్థాయి రాజకీయం మారుతోంది. మరోపక్క, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడం దృష్టి పెట్టిన కాంగ్రెస్ కూడా మునిసిపాలిటీలపై పట్టుకోసం అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో సగానికిపైగా మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలహీన పరిచేందుకు గతంలో బీఆర్ఎస్ ఏ ఎత్తుగడలు వేసిందో అవే ఎత్తులను హస్తం నేతలు ఇప్పుడు అమలు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగడానికి ఇంకా ఏడాది గడువు ఉండడంతో మెజారిటీ పాలక వర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తుందని గుర్తించవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన అభ్యర్థులు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గూటికి చేరడం చూశాం. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే ఈ సీన్ రివర్స్ అయ్యింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. గతంలో కాంగ్రె÷–సను వీడి బీఆర్ఎస్‌లో చేరిన వారు కూడా సొంతగూటికి చేరుతున్నారు. మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు అధికమయ్యాయి. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ చేతిలో ఉన్న మునిసిపాలిటీ పాలకవర్గాలు ఒక్కొక్కటిగా హస్తగతం అవుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు వల్లనైతేనేమీ, ఎక్స్ అఫీషియో ఓట్లు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఫిరాయింపుల వల్లనైతేనేమీ రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో 90 శాతానికి పైగా బిఆర్ఎస్ పార్టీకే దక్కాయి. దీంతో రాష్ట్ర స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకూ బీఆర్ఎస్ హవా నడిచింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. మున్సిపాలిటీల పాలకవర్గాలు అధికార పార్టీ బాట పడుతు న్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటిదాకా 34 మున్సిపాలిటీల పాలక వర్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ్యులు అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. ఇందులో 30 మున్సిపాలిటీల్లో పాలకవర్గ సమావేశాలు కూడా జరిగాయి. వీటిలో 15 మున్సిపాలిటీల్లో పాలకవర్గం ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. తొమ్మిది మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగ్గా ఆరు మున్సిపాలిటీల్లో జరగాల్సి ఉంది. ఎన్నికలు జరిగిన 9 మున్సిపాలిటీలూ అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం అయ్యాయి. మహబూబ్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, భూపాలపల్లి, నాస్పూర్, మంచిర్యాల, నల్లగొండ, వేములవాడ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరగా.. జగిత్యాల, భువనగిరి, ఖానాపూర్, హుజూర్‌నగర్, సుల్తానాబాద్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల పాలకవర్గ ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. ఇవి కాక మరో 20 మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కసరత్తు జరుగుతోంది.మరోపక్క, బీఆర్ఎస్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళుతున్నారు. ఇవి హస్తగతం అయితే కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది. ఎన్నికల ముందు దీనిని పూర్తి చేసుకుని తరవాత ఎమ్మెల్యేల వైపు చూడవచ్చన్నది కాంగ్రెస్ ఎత్తుగడగా ఉంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ కసరత్తు పూర్తి చేసే అవకాశం ఉంది.

# శ్రీకాళహస్తిలో శివరాత్రి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువుదీరిన వాయులింగేశ్వరుడు మహాశివరాత్రి ఉత్సవాలు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఇందుకు అనుగుణంగా ఆలయ అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో శివరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని చలువపందిళ్లు, మంచినీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికితోడు స్వామి దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఇదిలావుంటే భక్తుల పాలిట భూకైలాసంగా విరాజిల్లే శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోపల, ఆవరణలో కళాకారులు తీర్చిదిద్దిన రంగవల్లులు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన ఆలయం, గోపురాలకు చేసిన విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. జ్ఞానప్రసూనాంబిక అతిథిగృహ సమీపంలోని దుకాణ సముదాయ గోడకు వేసిన చిత్రాలు అబ్బురమనిపిస్తున్నాయి. విభిన్నరకాల నృత్య భంగిమలున్న ఈ చిత్రాలు అందరినీ కట్టిపడేస్తున్నాయి. ఇక్కడే శ్రీ–కాళ–హస్తి క్షేత్ర విశిష్టతను ప్రతిబింబించే చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయంలోని పలు ప్రదేశాలను కూలీలు నీటితో శుభ్రం చేస్తున్నారు. రాతిస్తంభాలపై పడిన ధూళిని ప్రత్యేక యంత్రాలతో తొలగిస్తున్నారు. ఉత్సవాలకు వివిధప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ ప్రాంగణంలో అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేయనున్నారు.

# ఉద్రిక్తత...

చండీగఢ్ : తమ తీరని డిమాండ్ల సాధన తో ఢిల్లీ వైపు సాగిన రైతుల ఢిల్లీ చలో ఆం దోళన బుధవారం తీవ్రస్థాయి ఉద్రిక్తతల నడుమ ఆరంభమైంది. హర్యానా సరిహద్దులలో కనౌరీ వద్ద హర్యానా భద్రతా బలగాలకు జరిగిన ఘర్షణలో ఓ 21 ఏళ్ల రైతు శుభ్‌కరణ్ సింగ్ మృతి చెందాడు. ఈ ప్రాంతంలోనే పరిస్థితి పూర్తిగా చేయిదాటి రణరంగాన్ని తలపించింది. పంజాబ్ నుంచి తరలివచ్చిన రైతులను హర్యానా సరిహద్దుల్లోని శంభు, కనౌరీ వద్ద పోలీసులు, భద్రతా బలగాలు అటకాయించారు. దీనిని రైతులు ప్రతిఘటించారు. ముందుకు సాగేందుకు యత్నించారు. దీనితో వీరిని చెదరగొట్టేందుకు హర్యానా పోలీసులు వారిపై భాష్పవాయువు ప్రయోగించారు. పలు భద్రతా వలయాలను ఛేదించుకుంటూ, బారికేడ్లను తీసివేస్తూ రైతులు ముందుకు సాగడంతో అంబాల సమీపంలోని శంభు సరిహద్దు రణరంగం అయింది. వీరిని నిలువరించడానికి మధ్యాహ్నానికి మూడు సార్లు భాష్పవాయువు ప్రయోగించారు. ఇక్కడనే టియర్‌గ్యాస్ ప్రయోగానికి డ్రోన్లను కూడా వాడారు. దీనితో రైతులు భాష్పవాయువు నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయాల్సి వచ్చింది. కనౌరిలో కూడా పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. రైతులను చెదరగొట్టారు. ఈ ప్రాంతం పూర్తిగా ఉద్రిక్తంగా మారింది. ముందుకు వెళుతున్న రైతులు, అక్కడి హర్యానా పోలీసులు, భద్రతా బలగాల నడుమ దాదాపుగా సంకుల సమరం జరిగింది.ఘర్షణల నడుమ తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు రైతులలో ఒక్క రైతు శుభ్‌కరణ్‌సింగ్ ఇప్పటికే చనిపోయాడని పాటియాలలోని రాజేందర్ర ఆసుపత్రి ఉన్నతాధికారి ఎస్ రేఖీ విలేకరులకు తెలిపారు. కనౌరీ సరిహద్దు నుంచి గాయపడ్డ వారిని ఈ ఆసుపత్రికి తరలించారు. తమ వద్దకు తీసుకువచ్చిన రైతులలో శుభకరణ్ సింగ్ తలకు గాయం అయిందని రేఖీ వివరించారు. ఇప్పుడు మృతి చెందిన రైతు పంజాబ్‌లోని భటిండా జిల్లా బలోకే గ్రామం అని రైతు నేత బల్దేవ్ సింగ్ సిర్సా తెలిపారు. తమ ఆందోళన దశలో రైతు మృతి ఇది మొదటిదని రైతు నేతలు తెలిపారు. హర్యానా పోలీసులు రైతులపై జులుం సాగించారని, ఓ భాష్పవాయువు, మరో వైపు రబ్బర్ బుల్లెట్లు వాడారని. రైతులు మాస్కులు ధరించి, కళ్లద్దాలు పెట్టుకుని తమను తాము పొగనుంచి రక్షించుకునేందుకు యత్నించారు. రైతుల కదలికలను పసికట్టేందుకు పలు చోట్ల డ్రోన్లను రంగంలోకి దింపారు. ఇవి ఆకాశంలో చక్కర్లు కొడుతూ కన్పించాయి. పలు ప్రాంతాల్లో రైతుల నేతలు అంతా శాంతియుతంగా ఉండాలని కోరడం కన్పించింది.అయితే ఇప్పటికే పరిస్థితి చేయించింది. యువరైతులు ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగకుండా రైతునేతల ప్రతినిధులు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. రైతులు తమ ముందున్న బారికేడ్లను తొలిగించుకుంటూ హర్యానాలోకి దూసుకువచ్చేందుకు యత్నించడంతో ఈ చర్యకు పాల్పడ్డారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు యత్నించారు. ప్రభుత్వంతో జరిపిన చర్చలు నాలుగో విడత కూడా విఫలం అయ్యాయి. దీనితో రెండు రోజుల విరామం తరువాత వేలాది మంది రైతులు ముందుకు కదిలారు. పంటలకు కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, పంటరుణ మాఫీల ప్రకటన రైతుల ప్రధాన డిమాండ్‌లుగా ఉన్నాయి. అయితే ప్రభుత్వ స్పందన సరిగ్గా లేకపోవడంతో రైతుల ఆందోళన బాట పడుతుంది. రైతుల ఢిల్లీ చలో ఈ నెల 13వ తేదీన ఆరంభం అయింది. అప్పటినుంచి రైతులు శంభు ఇతర సరిహద్దులలో ట్రక్కులు, ట్రాక్టర్లు, మినీవ్యాన్లలో మొహరించుకుని ఉన్నారు. రైతుల వద్ద ఉన్న పనిముట్లు తమకు ప్రమాదకరంగా ఉన్నాయని, రైతులు ముందుకు సాగకుండా చేయడమే తమ ముందున్న తక్షణ ఆలోచన , కర్తవ్యం అని భద్రతా బలగాలు నిర్ణయించుకున్నాయి. అధికార పనితీరు నుంచి కూడా ఈ దిశలో స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయని వెల్లడైంది.

**ఐదో దఫా చర్చకు రండి**

**కేంద్ర మంత్రి ముండా పిలుపు**

కాగా రైతులు శాంతియుతంగా ఉండాలని, సమస్యలను పరిష్కరించుకోవల్సి ఉంటుందని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా పిలుపునిచ్చారు. రైతుల ప్రతినిధులతో చర్చలకు దిగిన త్రిసభ్య మంత్రుల బృందంలో ముండా కీలక పాత్ర పోషించారు. అన్ని విషయాల గురించి చర్చించుకోవచ్చు, ఐదో దఫాలకు రావాలని పిలుపు నిచ్చారు. ఎంఎస్‌పి ఇతర విషయాలపై అయినా చర్చలతో పరిష్కారం కుదురుతుందని, దీనిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

**విజయం కోసం సంయమనం అవసరం**

**రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పిలుపు**

ఉద్రిక్తతల నడుమనే రైతుల నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మనమంతా శాంతియుతంగా క్రమశిక్షణతో ఉండాలి.

# అధికారంలోకి రావడమే బాబు లక్ష్యం

అమరావతి,ఎంత డబ్బు ఖర్చు పెట్టయినా అధికారంలోకి రావాలనేది చంద్రబాబు ఆలోచన అని, ఇప్పుడు పవన్ కళ్యాణ్ కూడా అవే మాటలు మాట్లాడుతున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు దుయ్యబట్టారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ పూర్తిగా దిగజారిపోయాడని, పూర్తిగా రూపాంతరం చెంది జన సైనికులను త్యాగాలకు సిద్ధం కావాలంటున్నారని మండిపడ్డారు. పవన్ నీచ రాజకీయాలను గమనించాలి. భీమవరంలో పవన్ కళ్యాణ్ ఎవరిని కలిసాడో జన సైనికులు ఆలోచించాలి. టీడీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి మరీ పవన్ కలిశాడు. జనసేన, కాపు నాయకుల ఇళ్లకు పవన్ ఎప్పుడైనా వెళ్ళారా?. కాపులకు రాజ్యాధికారం తెచ్చే ప్రయత్నం చేస్తున్నారనే చంద్రబాబు రంగాను అంతమొందించారు. పవన్ జనసేనను మర్చిపోయి సీనియర్ టీడీపీ నాయకుడిలా ప్రవర్తిస్తున్నారు. ఢిల్లీ వెళ్లి చీవాట్లు తిన్నానని చెప్పుకుంటున్నారు. పవన్ అసలు ఢిల్లీ వెళ్లి ఎవరిని కలిశాడు?ఎవరి కోసం కలిశాడు? అంటూ అడపా శేషు దుయ్యబట్టారు. ‘కాపులను ఉద్ధరించడానికి, జన సైనికులను ఎమ్మెల్యేలుగా చేయటానికి వెళ్లాడా?. పాతవాళ్లు పోతారు.. కొత్తవాళ్లు వస్తారని పవన్ చెప్తున్నారు. టీడీపీ నేతలను చేర్చుకోవడానికి పవన్ సిద్ధమయ్యారు. కాపులు తనకి ఓటు వేయరని, తనను నమ్మరని పవన్ ముందే చెప్పారు. పవన్ జనసేనను టీడీపీలో విలీనం చేస్తారనే అనుమానం కలుగుతోంది. పవన్ తెలుగుదేశం తొత్తు‘ అంటూ ఆయన ధ్వజమెత్తారు. పవన్ వల్ల కులం భ్రష్టుపడుతుందని జోగయ్య లేఖ ద్వారా తెలిపారు. తెర వెనుక జరిగిన కుంభకోణాన్ని బయటపెట్టాలి. జగన్ పాలనలోని సంస్కరణలు కళ్లకు కనిపించట్లేదా?. మత్తులో ఉన్నాడు కాబట్టే రంగాను హత్య చేసిన టీడీపీతో పవన్ జతకట్టాడు. పేదల రక్తాన్ని పీల్చేసిన వ్యక్తి చంద్రబాబు. ప్రజాసొమ్మును పెత్తందార్లకు దోచిన వ్యక్తి చంద్రబాబు. రాబోయే కురుక్షేత్రంలో కాపులంతా టీడీపీని భూస్థాపితం చేయాలని అంటూ అడపా శేషు పిలుపునిచ్చారు.

# అగ్నిప్రమాదంపై దర్యాప్తు

సిద్దిపేట,ఫిబ్రవరి22: సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. రైతులకు ఇబ్బందిలేకుండా వ్యవసాయానికి ఉదయం నుంచి కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. దురదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. మూడు రోజుల వరకు కరెంట్ రాదనుకున్నాం ..కానీ వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ ఇచ్చామన్నారు. సిద్దిపేట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం కారణంగా సిద్దిపేట పట్టణంతోపాటు పరిసర మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లకు కూడా మంటలు వ్యాపించడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హైదరాబాద్ నుంచి ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదస్థలిని మంత్రి పొన్నం ప్రభాక్ సందర్శించారు. కారణాలను తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి త్వరగా పునరుద్దరణ చేపట్టాలన్నారు. సిద్దిపేటలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సబ్‌స్టేన్‌లో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. పీటీఆర్ పేలిపోవడం వల్లే సబ్ స్టేషన్‌లో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. మూడు అగ్నిమాపక యంత్రాలతో మంటలు ఆర్పామన్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. జరిగిన ప్రమాదంపై విచారణకు ఆదేశించామని మంత్రి చెప్పారు. కాగా, సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రమాదంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు రేగాయి. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. విద్యుత్ ట్రిప్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే గతకొంతకాలంగా ప్రతిదానికి విమర్శలు చేస్తున్న బిఆర్ఎస్ తాజాగా ఈ ప్రమాదంపైనా విమర్శలకు దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సబ్ స్టేషన్ల నిర్వహణ కూడా సరిగా రావడం లేదని బీఆర్ఎస్ విమర్శిస్తే.. గత ప్రభుత్వంలో చేపట్టిన నాసి రకం పనుల వల్లే ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. ఈ ఘటనకు రాజకీయం రంగు పులుముకుంది. విద్యుత్ సరఫరా నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శించాయి. కాంగ్రెస్ ను ఓడించిన సిద్ధిపేట ప్రజలను చీకట్లో మగ్గపెట్టి ఆ పార్టీ పగ తీర్చుకుంటోందంటూ హరీష్ రావు విమర్శలు గుప్పిస్తున్నారు. సిద్ధిపేట పట్టణంతోపాటు 5 మండలలాకు సరఫరా నిలిచిపోయిందంటూ మండిపడుతున్నారు. దాదాపు మూడు గంటల పాటు సబ్ స్టేషన్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి మాట్లాడిన హరీశ్ రావు తక్షణం హైదరాబాద్ నుంచి విచారణ బృందాలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు సిద్ధిపేటకు చేరుకున్న తర్వాత వాళ్లతో మాట్లాడిన హరీశ్ రావు ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తక్షణం విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే అగ్ని ప్రమాదాలు అనుకోకుండా సంభవిస్తాయని వీటికి ఎవరూ కారకులు కారని కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగింది. సబ్ స్టేషన్ లో అగ్నిప్రమాదానికి కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఏంటని వారు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల విమర్శలను తిప్పికొట్టిన కాంగ్రెస్...రెండు నెలల క్రితం వరకు మీ పార్టీయే అధికారంలో ఉందని వారు ఎందుకు నిర్వహణ పట్టించుకోలేదని మండిపడింది. అగ్నిప్రమాదం జరిగిన ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ఇలాంటి చౌకబారు విమర్శలు ఏంటని మండిపడింది.

### మేడారంలో గుండెపోటుతో భక్తుడు మృతి

ములుగు,మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామానికి చెందిన చింతల కొమురయ్య(68) తన కుటుంబు సభ్యులతో కలిసి మేడారం వచ్చాడు. వీరంతా జంపన్న వాగు అవతలి వైపున విడిది చేశారు. కాగా, గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే వైద్యశాలకు తరలించారు.

# న్యాయంగా బతికిన ఎంఎల్ఏకు అన్యాయం



బీహార్:చిన్న వయసులోనే న్యాయం, హక్కుల కోసం రోడ్డెక్కిన విద్యార్థి నాయకుడు ఇప్పుడు ఎంఎల్ఏగా గెలుపొందేందుకు న్యాయం కోసం పోరాటం చేస్తూనే ఉన్నాడు. చట్టసభల లోపల, బయట ప్రజాగొంతుకగా నిలిచిన ఈ వర్ధమాన యువ ఎంఎల్ఏ మరింత పట్టుదలతో రాజ్యంతో పోరాడుతున్నాడు. మార్క్సిస్టు – లెనిస్టు విప్లవకారుడు. రాజకీయ ప్రత్యర్థుల కుట్రలో హత్యకేసులో ఇరికించబడి ఎంఎల్ఏ పదవి కోల్పోయి న్యాయం కోసం పోరాడుతున్నాడు. అతని పేరు కామ్రేడ్ మనోజ్ కుమార్ మంజిల్. రచయిత, కలం పేరు మంజిల్. లక్ష్యం, గమ్యం ఉన్న నాయకుడు. నిరుపేద దళిత కుటుంబం నుంచి వచ్చాడు. సడక్ పే స్కూల్ (వీధుల్లో పాఠశాలలు) ఉద్యమం అతని నాయకత్వంలో జరిగింది. ఆ ఉద్యమం జాతీయ స్థాయి ఖ్యాతి పొందింది. 36 ఏండ్లకే బీహార్ రాష్ట్రంలోని అజియోన్ (ఎస్‌సి) నియోజకవర్గం నుంచి 2020లో సిపిఐ (యంయల్) లిబరేషన్ అభ్యర్థిగా గెలుపొందాడు.ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన దళిత యువ ఎంఎల్ఏగా గుర్తింపు పొందాడు. మనోజ్ కపూర్ణిహార (దేవ్)కు చెందిన నిరుపేద దళిత కూలీ సంతానం. 1984లో జన్మించాడు. తల్లిదండ్రులు మిల్లేష్ కుమార్ ఇటుక బట్టి, వ్యవసాయ కార్మికులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం. ఉన్నత చదువుల కోసం అనేక ఇబ్బందులకు గురయ్యాడు. గ్రాడ్యుయేషన్ కోసం అర్రాకు వెళ్లాడు. మనోజ్ తల్లిదండ్రులకు యన్యల్ పార్టీ నేపథ్యం ఉంది. వారి ఆశ, ఆశయాల ప్రతి రూపం ఇతడే. బీహార్ రాష్ట్రంలో జయప్రకాష్ చేపట్టిన ఉద్యమంలో మనోజ్ మామయ్యాడు. ఫ్యూడలిజంపై తిరుగుబాటు చేసి పద్నాలుగేళ్ల కాలం జైలు జీవితం గడిపాడు. 1970 ప్రాంతంలో వారి గ్రామం హదియబాద్ భూస్వామ్య శక్తుల చేతుల్లో బూడిదయ్యింది.అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అటువంటి పరిస్థితుల్లో మనోజ్ తల్లి ప్రాణాలతో బయటపడింది. సర్వస్వం కోల్పోయింది. భూస్వామ్యశక్తులు, రణవీర్ సేన ప్రైవేటు సైన్యాల ఆరాచకాలకు ఆ కుటుంబం ఎదురొడ్డి నిలబడింది. మనోజ్ విప్లవ పథానికి మనోజ్ కుటుంబ నేపథ్యమే మాతృక. ఆయనొక ఫైర్‌బ్రాండ్, ప్రసిద్ధి పొందిన నాయకుడు. అణగారిన పిల్లలను సమీకరించి విద్యా హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేపట్టారు మనోజ్. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐయస్ఎ) నాయకుడిగా చేసిన ఉద్యమాలు బాగా ప్రాచుర్యం పొందాయి. విద్యా హక్కుల పోరాటం బలహీనవర్గాల ఆకలిని, ఏలికల డొల్ల తనాన్ని ఎత్తిచూపింది.గ్రామీణ పేద కుటుంబాల పిల్లలకు విద్యను నిజమైన హక్కుగా మార్చడానికి ‘సడక్ పే స్కూల్’ ఉద్యమం అత్యంత వినూత్న ప్రచారాలలో ఒకటి. అధ్వాన్నమైన పాఠశాలల దుస్థితిపై రోడ్లపై సింబాలిక్ తరగతులు నిర్వహించడం, పాఠాలు బోధించడం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో పాఠశాలలో వసతుల లేమి, పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయుల కొరత, బోధనా నాణ్యత, కులతత్వం, మరుగుదొడ్ల వంటి సమస్యలపై రాజకీయ పోరాటంగా మలిచాడు. అప్పటి నితీశ్ కుమార్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ప్రాథమిక విద్యా పథకాల అమలుకు ఈ పోరాటం కదిలింది. ఆ తర్వాత దళితుల భూమి హక్కులు, రోడ్లు, విద్యుత్, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఇతర పౌర సమస్యలపై ప్రజలను సమీకరించారు. పోరాటాలు చేయడంలో సమరశీలతను చాటాడు. విద్యార్థి ఉద్యమం తరువాత విప్లవ యువజన సంఘం (ఆర్‌వైఎ) జాతీయ అధ్యక్షుడిగా పని చేశాడు. ప్రస్తుతం ఆల్ ఇండియా అగ్రికల్చరల్ అండ్ రూరల్ లేబర్ అసోసియేషన్ (అయార్ల) అధ్యక్షుడిగా వ్యవసాయ, కార్మిక సంస్థను నడిపించే బాధ్యతను చేపట్టారు.2015 ఎన్నికల సమయంలో భోజ్‌పూర్ జిల్లా అజింబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో మనోజ్‌తో పాటు 22 మందిని నిందితులుగా చేర్చారు. మనోజ్ జైలు నుంచి ఎన్నికల్లో పోటీ చేయవలసి వచ్చింది. ఎన్నికల ప్రచారం చేయకుండా ఆధిపత్యం, భూస్వామ్య శక్తులు రాజ్యం అండతో నిరోధించబడ్డాయి. కేసుల పేరుతో ఆయనను జైలుకు పంపించారు. అయినా ఆ ఎన్నికల్లో 35 వేల పైచిలుకు ఓట్లను సాధించడం ఓ పెను సంచలనం. అప్పుడు మూడో స్థానంలో నిలిచిన మనోజ్ ఏడాది తర్వాత బెయిల్‌పై విడుదలైన అజియోన్, భోజ్‌పూర్‌లోని అణగారిన ప్రజల కోసం హక్కులు, గౌరవాన్ని సాధించేందుకు అనేక పోరాటాలను ప్రారంభించారు.తొమ్మిదేళ్ల కిందటి రాజకీయ దురుద్దేశ కేసులో మనోజ్ మంజిల్‌తో పాటు 22 మంది ఇతర సహచరులను అరా సివిల్ కోర్టు ఈ నెల 13న దోషులుగా చూపుతూ జీవిత ఖైదు విధించింది. దీంతో ఎంఎల్ఏపై అనర్హత వేటు పడింది. రాజ్యాంగంపై నమ్మకం లేని పాలకులు ప్రజాస్వామ్యంపై నిరంతర దాడిని కొనసాగిస్తున్నారు. వీరికి వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో ఎంఎల్ఏ మనోజ్ కుమార్ న్యాయం కోసం పోరాడుతున్నాడు. అతనికి తన పార్టీ అండగా వుంది. అక్కడి ప్రజలు అన్యాయానికి, ఫాసిస్టు దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా మనోజ్ పక్షాన నిలబడి పోరాడుతున్నారు. మనోజ్‌కు మద్దతుగా బీహార్ మొత్తం ఉద్యమం జరుగుతుంది. ఈ నెల 19 నుంచి 25 వరకు పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల గ్రామాల్లోకి వెళ్లి న్యాయ మారణకాండకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు.

# ఐశ్వర్యారాయ్‌పై రాహుల్ వ్యాఖ్యల దుమారం

న్యూఢిల్లీ,బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ బచ్చన్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయోధ్యలో సామాన్యులకు ఆహ్వానం లేదని, కేవలం బచ్చన్ కుటుబం, ఐశ్వర్య డ్యాన్స్ మాత్రమే కనిపించిందని జోడోయాత్రలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఐశ్వర్యపై కించపరిచే వ్యాఖ్యలు చేసి, రాహుల్ మరింత దిగజారిపోయారని ఆరోపించింది. స్వయంకృషితో ఎదిగిన మహిళల పట్ల రాహుల్ భయంకరమైన స్వభావాన్ని కలిగి ఉన్నారంటూ విమర్శలు గుప్పించింది. సీన్‌లోకి కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కూడా తీసుకొచ్చి చురకలంటించింది. ఇదే సమయంలో.. ప్రముఖ గాయని సోనా మహపాత్ర కూడా రాహుల్‌పై మండిపడింది. రాజకీయ లబ్ది కోసం పొలిటీషియన్స్ మహిళల్ని కించపరిచడం కరెక్ట్ కాదని సూచిస్తూ.. ఐశ్వర్యకు మద్దతు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో ’భారత్ జోడో న్యాయ్ యాత్ర’ సందర్భంగా.. రాహుల్ గాంధీ బీజేపీని టా÷-గ్గ్ం÷ట్ చేసుకొని విమర్శలు గుప్పించారు. జనవరి 22వ తేదీన అయోధ్యలోని రామాలయంలో జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి బాలీవుడ్ ప్రముఖులు, బిలియనీర్లను మాత్రమే బీజేపీ ఆహ్వానించిందని.. కానీ దేశంలో 73 శాతం జనాభా కలిగిన ఓబీసీ, దళిత లేదా గిరిజన వర్గాలకు చెందిన వారిని పిలవలేదని అన్నారు. ఈ ప్రాణప్రతిష్ఠ వేడుకలో ఓబీసీ వర్గానికి చెందిన వారు ఒక్కరు కూడా కనిపించలేదని.. అక్కడ అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యరాయ్, ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని పేర్కొన్నారు. తాను ఒక రైతుని గానీ, కార్మికుడిని గానీ, చిరు వ్యాపారిని గానీ ఆ కార్యక్రమంలో చూడలేదని చెప్పుకొచ్చారు. టెలివిజన్ ఛానెళ్లు కేవలం ఐశ్వర్యరాయ్ డ్యాన్సింగ్ వీడియోలే చూపిస్తాయని, పేద ప్రజల గురించి ఏమీ చూపించవని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే ఇప్పుడు తీవ్ర దుమారం రేపాయి.రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ స్పందిస్తూ.. భారతీయుల నిరంతర తిరస్కరణలతో విసుగు చెందిన రాహుల్ గాంధీ, భారత్ గర్వించే ఐశ్వర్యను కించపరిచే స్థాయికి దిగజారారని ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంతవరకూ ఒక్క విజయం సాధించని రాహుల్.. దేశానికి ఎంతో కీర్తిని తెచ్చిన ఐశ్వర్యపై దూషణలకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కన్నడ ఆత్మగౌరవం గురించి మాట్లాడే సీఎం సిద్దరామయ్య.. సాటి కన్నడ వ్యక్తిపై రాహుల్ చేసిన అవమానకర వ్యాఖ్యల్ని ఖండిస్తారా? లేక సీఎం కుర్చీని కాపాడుకోవడం కోసం మౌనంగా ఉంటారా? అని ప్రశ్నించింది. ఇక సింగర్ సోనా మహపాత్ర కూడా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రాజకీయ లబ్ది కోసం పొలిటిషియన్లు మహిళలపై ఇలాంటి కించపరిచే వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏదేమైనా.. ఐశ్వర్య ఎంతో అందంగా డ్యాన్స్ చేస్తుందని స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చింది

# హిందూ దేశంగా నేపాల్...!?

నేపాల్: కొన్ని శతాబ్దాల క్రితం అఖండ భారత్ లో భాగంగా ఉన్న నేపాల్ తరువాత కాలంలో వలస పాలకుల టైం లో వేరు పడింది. భారత్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించాక భారత్ లో తిరిగి విలీనం అయ్యేందుకు నాటి పాలకులు చూశారు అని చరిత్రలో ప్రచారంలో ఉన్న మాట. అయితే ఎందుకో అది కుదరలేదు. ఇదిలా ఉంటే గత రెండు దశాబ్దాల క్రితం దాకా నేపాల్ హిందూ రాజ్యంగా ఉండేది. ఈ ప్రపంచంలో భారత్ లో హిందువులు పెద్ద ఎత్తున ఉంటారు. ఆ తరువాత ప్లేస్ నేపాల్ దే. ఈ రెండు దేశాలలోనే హిందువులు తమ ఉనికి చాటుకునేవారు. అలాంటి నేపాల్‌లో మార్పులు 2008లో సంభవించాయి. అప్పట్లో నేపాల్ హిందూ దేశం నుంచి మారిపోయింది, భారత్ మాదిరిగానే లౌకిక రాజ్యంగా మార్పు చేశారు. దానికి కారణం మావోయిస్టులు వామపక్ష ఉద్యమకారులు. మావోలు ఉద్యమ బాటను వీడి జన జీవన స్రవంతిలో కలిశాక వారు రాజకీయాల్లోకి ప్రవేశించారు. దాంతో హిందూ దేశంగా ఉన్న నేపాల్ లో కూడా మార్పులు వచ్చాయి. మావోలు వామపక్ష భావజాలం ఉన్న అధికారంలో రావడంతోనే భారత్ వ్యతిరేక వైఖరిని కూడా అనుసరించడం మొదలైంది అని వారు ప్రచారంలో ఉన్నారు. అలాగే చైనాకు సన్నిహితంగా నేపాల్ మెలగడం కూడా మావోలు వామపక్ష భావాలు ఉన్న పాలకులు అధికారం చలాయించడమేనని అంటున్నారు. ఇది దాదాపు రెండు దశాబ్దాల కాలం తరువాత నేపాల్ తిరిగి తన పూర్వ రూపాన్ని సంతరించుకోవాలని ఉద్యమం రేగుతోంది. ! పైగా నేపాల్ భారత్ తో తన బంధాలు బలపరచుకోవాలని స్థానిక ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ నేపథ్యంలోనే నుంచి చూసినపుడు నేపాల్‌ను హిందూ దేశంగా ప్రకటించాలన్న డిమాండ్లు అంతకంతకూ పెరుగుతున్నాయి. వైదిక్ సనాతన్ హిందూ దేశంగా నేపాల్‌ను ప్రకటించాలని జనం నుంచి వచ్చిన డిమాండుని జనం అవసరాలను గమనించిన పార్టీలు గుర్తించి ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో మొదటి స్థానంలో ఉన్నది అతి పెద్ద పార్టీ అయిన నేపాలీ కాంగ్రెస్. ఆ పార్టీ ఇపుడు ఈ డిమాండ్ ని నెత్తికెత్తుకుంది. నేపాల్ లో పూర్తి అధికారం కోసం తన ప్రాభవం కోసం నేపాలీ కాంగ్రెస్ ఈ విధంగా ప్రజల డిమాండ్ ని ఆసరాగా చేసుకుని ముందుకు అడుగులు వేస్తోంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన సుమారు 950 మంది జనరల్ కమిటీ సభ్యులు తాజాగా ఒక సమావేశంలో హిందూ రాజ్యాన్ని డిమాండ్ చేస్తూ పిటిషన్‌పై సంతకం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న 14వ మహా సమితి సమావేశాల్లో ఈ తీర్మానాన్ని ఆమోదించారు కూడా. నేపాలీ కాంగ్రెస్ లో విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అతిపెద్ద సమావేశంగా దీన్ని చూసారు. అలాంటి మహాసమితిలో ఈ తీర్మానానికి ఆమోదం లభించడం లేదు. ఈ సమావేశంలో దాదాపు 2200 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. పార్టీ కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శంకర్ బండారి నేపాల్ హిందూ దేశంగా మారాలన్న డిమాండుకు నేతృత్వం వహిస్తున్నారు. దాంతో ఆయన నేపాలీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ షేర్ బహదూర్ దేవుబా ముందు కూడా తమ డిమాండ్లను వినిపించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదని అధ్యక్షుడు చెప్పినట్టు. కానీ ఇది నేపాల్‌లో అత్యధిక శాతం జనం మాట అని శంకర్ బండారీ వాదిస్తున్నారు. ఒకవేళ ఏదైనా కారణం చేతనైనా ప్రజాభిప్రాయాన్ని మన్నించకపోతే పార్టీ ఇబ్బందుల్లో పడుతుందని నేపాలి కాంగ్రెస్ పార్టీ అధినేత శంకర్ బండారి చెప్పి హెచ్చరించారని అంటున్నారు. మరో వైపు చూస్తే నేపాల్ ని హిందూ రాజ్యంగా చేయాలన్న డిమాండ్‌పై సీపీఎన్-యూఎంఎల్, సీపీఎన్ (మావోయిస్ట్ సెంటర్)లు సైలెంట్ గా ఉంటూ అన్నీ గమనిస్తున్నాయి. అయితే కీలక పరిణామం ఏంటి అంటే నేపాల్ దేశంలో నాలుగో అతిపెద్ద పార్టీగా ఉన్న రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ కూడా ఈ డిమాండ్‌తో ఏకీభవించడం. మొత్తం మీద చూస్తే చాలా తొందరలోనే నేపాల్ హిందూ దేశంగా మారబోతోంది అని అంటున్నారు. అదే జరిగితే పొరుగున మోగిన హిందూత్వ నినాదం భారత్ లోనూ కీలక మార్పులకు దోహదం చేస్తుందని అంటున్నారు. అంతే కాదు 2024 సార్వత్రిక ఎన్నికల తరువాత మరోసారి బీజేపీ దేశంలో అధికారంలోకి వస్తే కనుక భారత్ లో కూడా ఆ తరహా డిమాండ్లు వచ్చే అవకాశాలు ఉంటాయని అంటున్నారు.

# చిగురిస్తున్న ‘ఇండియా’

న్యూఢిల్లీ,ప్రస్తుత బిజెపిని ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దె దించమనే ఏకైక లక్ష్యంతో కూటమిగా ఏర్పాటయిన ప్రతిపక్ష పార్టీలు ఆ దిశగా పురోగతి సాధిస్తున్నాయి. గత జూన్‌లో ‘ఇండియా’ కూటమిగా ఏర్పడిన విపక్షాలు ఆ తర్వాత సీట్ల సర్దుబాటు విషయంతో కాంగ్రెస్ తీరుతో విసిగి పోయి ఒకదానికొకటి కుంపట్లు పెట్టడం ప్రారంభించింది. దీంతో కూటమి మనుగడే ప్రశ్నార్థకమైంది. ముందుగా ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన బీహార్ ముఖ్యమంత్రి, జెడి(యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్ కాంగ్రెస్, ఆర్‌ఆర్‌డిలతో కూడిన ‘మహా ఘట్‌బంధన్’కు గుడ్’ చెప్పి తిరిగి బిజెపితో జతకట్టడంతో ఆ కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అదే సమయంలో కూటమిలో ప్రధాన కూటమిలో బెయిన బెయిన బెయిన మమత కాంగ్రెస్, యుపిలో అఖిలేశ్ యాదవ్ నుండి సమాజ్‌వాది పార్టీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆద్మీ పార్టీ తమ తమ రాష్ట్రాల్లో ఒంటరిగా బరిలోకి దిగుతామని ప్రకటించి కాంగ్రెస్ పార్టీ డిఫెన్స్‌లో పడేశాయి.అయితే కేవలం వారాల వ్యవధిలోనే రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు ఆ పార్టీలు ఒక్కటొక్కటిగా తిరిగి కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సిద్ధమవుతున్నాయి. ఈ విషయంలో అందరికన్నా అఖిలేశ్ ఓ అడుగు ముందుకేసి సీట్ల సర్దుబాటును కాంగ్రెస్ ఖరారు చేసింది. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా యూపీలో ఎక్కువ స్థానాలను గెలుచుకుందామని. 80 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అత్యధిక స్థానాలను దక్కించుకుని తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగింది. ఇప్పుడు అయోధ్యలో రామాలయ నిర్మాణం, రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనుల కారణంగా ఓటర్లకు మరింత చేరువ అవుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా. మరో వైపు మాజీ ముఖ్యమంత్రి , బిఎస్‌పి అధినేత్రి మాయావతి రాష్ట్రంలో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని, ఒంటరిగా పోటీ నిర్వహిస్తున్నారని ఇప్పటికే ప్రకటించారు.కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ స్వయంగా రంగంలోకి దిగి అఖిలేశ్‌తో చర్చలు జరపడంతో రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారైందన్న వార్తలు వచ్చాయి. దీంతో సీట్ల సర్దుబాటు తేలేదాకా యుపిలో జరుగుతున్న రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రలో పాల్గొనేది లేదని భీష్మించుకు కూర్చున్న అఖిలేశ్ ఇప్పుడు యాత్రలో పాల్గొంటున్నట్లు ప్రకటించడం విశేషం. ఇది రెండు పార్టీల కార్యకర్తలకు నైతిక బలాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.మరోవైపు కేజ్రీవాల్ ‘ఆప్’ పరిస్థితి కూడా దాదాపుగా ఇలాగే ఉంది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాల్లో పోటీ ఏకపక్షంగా ప్రకటించిన ఆ పార్టీ పంజాబ్‌లో కూడా తాము ఒంటరిగా బరిలోకి దిగుతామని చెప్పి కాంగ్రెస్‌ను పూర్తిగా ఆత్మరక్షణలో పడేసింది. అయితే గత కొద్ది రోజులగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేజ్రీవాల్ మధ్య అనేక దఫాలు చర్చలు జరగడంతో ఇప్పుడు ‘ఆప్’ మెట్టు వచ్చింది. ముందుగా ఢిల్లీలో సీట్ల సర్దుబాటుకు సంబంధించి ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరినట్లు, ఆప్ నాలుగు స్థానాల్లో, కాంగ్రెస్ మూడు చోట్ల పోటీ చేయడానికి అంగీకరించినట్లు తెలుస్తోంది.అలాగే గోవా, హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించి కూడా ఈ రెండు పార్టీల మధ్య అంగీకారం కుదిరినట్లు తెలుస్తోంది.



అధికారికంగా ప్రకటించనప్పటికీ మోడీ సొంతరాష్ట్రమైన గుజరాత్‌లో ఆప్ భరూచ్, భావ్‌నగర్ స్థానాల్లో పోటీ చేయనుండగా, మిగిలిన 24 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుంది. ఈ రెండు స్థానాలకు ఆప్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. అలాగే పది లోక్‌సభ స్థానాలున్న హర్యానాలో ఆప్ ఒక చోట పోటీ చేయవచ్చని తెలుస్తోంది. కేంద్రపాలిత ప్రాంతమయిన చండీగఢ్ లోక్‌సభ స్థానంలోనూ కాంగ్రెస్ బరిలో ఉంటుంది. అయితే ‘ఆప్’ అధికారంలో ఉన్న పంజాబ్‌లో మాత్రం ఇంకా ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఇంకా చర్చలు జరగలేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 13 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 8 చోట్ల విజయం సాధించగా ఒక్క చోట మాత్రమే గెలుపొందింది. అయితే ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ‘ఆప్’ అనూహ్యంగా తిరుగులేని విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. మారిన రాజకీయ పరిస్థితులతో ఆ పార్టీ రాష్ట్రంలో మెజారిటీ స్థానాలకోసం పట్టుబడుతోంది. అయితే ఇప్పుడు పంజాబ్ విషయంలో కూడా ఇరు పార్టీలు ఓ మెట్టు దిగి సీట్ల సర్దుబాటుకు అంగీకరించే అవకాశం లేకపోలేదని విశ్లేషకుల అంచనా.‘ఆప్’లో ఇంత మార్పు రావడానికి ఇటీవలి చండీగఢ్ మేయర్ ఎన్నికల పరిణామాల ప్రభావం కీలక పాత్ర పోషించిందని పరికుల అంచనా. ఈ పరిణామం ఆ రెండు పార్టీలపైనే కాకుండా ఇండియా కూటమిలోని అన్ని పక్షాలపై ప్రభావం చూపించింది. ‘కలసి ఉంటే కలదు సుఖం’ అన్న సత్యాన్ని ఆ పార్టీలు గ్రహించినట్లు తెలుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్, కూటమి మధ్య పొత్తుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఆర్జేడి, వామపక్షాలు లాంటి పార్టీలతో కాంగ్రెస్‌కు ఎలాంటి పేచీ ఇప్పటివరకు లేదు. ఇక మిగిలింది పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర మాత్రమే. ఈ రెండు రాష్ట్రాల్లో కూడా దీదీ పార్టీ టిఎంసి, ఉద్ధవ్ థాక్రే రద్దుని శివసేనలతో కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు చేసుకోగలిగితే కూటమిలో పొత్తులు దాదాపు కుదిరినట్లే. మార్చి రెండో వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చన్న వార్తలు నేపథ్యంలో కూటమిలోని భాగస్వామ్య పక్షాలు సైతం సీట్ల సర్దుబాటు చర్చల ప్రక్రియను మరింత వేగవంతం చేసే అవకాశాలున్నాయి. నెల రోజుల క్రితం ఉంటుందా లేదా అనే స్థితిలో ఉన్న’ఇండియా’ కూటమిలో ఇప్పుడు అన్ని పార్టీలు తిరిగి ఏకతాటిపైకి వస్తుండడం చూస్తే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని కలిసికట్టుగా ఢీకొనాలన్న ప్రతిపక్షాల లక్ష దాదాపుగా నెరవేరుతుందని.

# గందరగోళంలో టిడిపి,జనసేన

సత్తెనపల్లి,టీడీపీ, జనసేన పార్టీలు గందరగోళంలో ఉన్నాయని, ఎవరు ఎక్కడ పోటీ చేస్తారో తెలీదంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. గురువారం ఆయన సత్తెనపల్లెలో మీడియాతో మాట్లాడుతూ, ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేస్తారో కూడా తెలీదు. చంద్రబాబు, పవన్ రెస్ట్ తీసుకోవాల్సిన టైం వచ్చింది. ఏ పార్టీకి విశ్వాసం లేని వ్యక్తి నాపై పోటీకి దిగుతున్నాడు. ఇద్దరు విశ్వాస ఘాతకులు నాపైనా, అనిల్‌పైనా పోటీ చేస్తున్నారు. పార్టీలు మారిన వ్యక్తులు మాపై పోటీ చేస్తున్నారు. విశ్వాస ఘాతకులను తరిమికొట్టాలని సత్తెనపల్లి ప్రజలను కోరుతున్నానని మంత్రి అంబటి పిలుపునిచ్చారు. ‘చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది. ఓట్లు కొనాల్సిందేనని పవన్ మాటలతో అర్థమవుతోంది. చంద్రబాబుతో పొత్తు అంటే బీజేపీ జాతీయ నేతలు ఎందుకు తిట్టకుండా ఉంటారు. బీజేపీతో పొత్తులో ఉండి చంద్రబాబుతో పొత్తు ఏంటి?. రానున్న రోజుల్లో పవన్ మరిన్ని చివాట్లు తింటారు. భువనేశ్వరి వ్యాఖ్యలను చంద్రబాబు ఖండించలేదు. కుప్పంలో చంద్రబాబు ఓడిపోతారని తేలిపోయింది. చంద్రబాబు బాటలోనే పవన్ నడుస్తున్నాడు.

# టార్గెట్ ఓవైసీ.. హైదరాబాద్ సీటూ గెలవాల్సిందే



న్యూఢిల్లీ,మిషన్ 400 ప్లస్ లక్ష్యంతో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధపడుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గెలిచే అవకాశమున్న ప్రతి సీటుపైనా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో హైదరాబాద్ స్థానాన్ని సైతం గెలుపొంది తమ ఖాతాలో ఒక సీటు చేర్చుకోవడంతో పాటు మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ వరుస విజయాలకు బ్రేకులు వేయాలని ఆ పార్టీ భావిస్తోంది. ఈ నియోజకవర్గంలో 1984 నుంచి ఓవైసీ కుటుంబ ఆధిపత్యం కొనసాగుతోంది. వరుసగా 6 పర్యాయాలు సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ గెలుపొందగా.. 2004 నుంచి వరుసగా అసదుద్దీన్ ఓవైసీ గెలుపొందుతూ వచ్చారు. 1996లో బీజేపీ అగ్రనేత వెంకయ్య నాయుడు పోటీ చేసినప్పటికీ.. సలావుద్దీన్ ఓవైసీ చేతిలో 73,273 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఈ పార్లమెంట్ స్థానం పరిధిలో మలక్‌పేట, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ ఏడు నియోజకవర్గాల్లో గోషామహల్ స్థానం ఒక్కటే బీజేపీ గెలుచుకుంది. మిగతా 6 స్థానాల్లో ఏఐఎంఐఎం పార్టీ నేతలే గెలుపొందారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ 50% మించి ఓట్లు సాధించినప్పటికీ, 2009లో 42 శాతం ఓట్లు, 2004లో 37 శాతం ఓట్లతోనే గెలుపొందారు. ఈ విజయ పరంపరకు అడ్డుకట్ట వేయడానికి విభిన్న వ్యూహాలతో ముందుకెళ్లాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు.

ఆ ఓట్లు చీల్చి, ఈ ఓట్లు ఏకం చేయాలి

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో హిందు – ముస్లిం జనాభా అటూఇటుగా సరిసమానంగా ఉన్నప్పటికీ ముస్లిం ఓట్లన్నీ ఏఐఎంఐఎం (మజ్లిస్) పార్టీకి గంపగుత్తగా పడుతుండగా.. హిందూ ఓట్లు వివిధ పార్టీల మధ్య చీలిపోతున్నాయి. ఈ కారణంగానే ఓవైసీ కుటుంబం గత 4 దశాబ్దాలుగా ఓటమి ఎరుగకుండా గెలుపొందుతూ వస్తోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే.. హిందూ ఓట్లను ఏకం చేయడంతో పాటు ముస్లిం ఓట్లను చీల్చాల్సి ఉంటుంది. ఆ దిశగా కమలనాథులు వ్యూహాలు పన్నుతూ అడుగులు వేస్తున్నారు. మొదటగా హిందూ ఓట్లను ఏకం చేయడం కోసం రాష్ట్రంలో హిందూ ఐకాన్‌గా పేరొందిన నేతను బరిలోకి దించాలి. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా హిందుత్వవాదులుగా పేరొందిన బీజేపీ నేతల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాత్రమే కనిపిస్తున్నారు. ఇద్దరు నేతల్లో ఎవరిని బరిలోకి దించినా హిందూ ఓట్లను ఏకం చేయగలిగే శక్తి ఉందని అంచనా వేస్తున్నారు. అయితే బండి సంజయ్ ఇప్పటికే కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉండగా ఈసారి కూడా అక్కణ్ణుంచే బరిలోకి దిగేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నారు. ఆ స్థానంపై బీజేపీలో మరికొందరు నేతలు కన్నేసినప్పటికీ బండి సంజయ్‌ను కాదని మరొకరికి ఆ సీటును అప్పగించే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. దీంతో రాజాసింగ్ అభ్యర్థిత్వమే ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన ఇప్పటికే హైదరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న గోషామహల్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనే కాదు తెలంగాణ అంతటా పరిచయం అవసరం లేని నేత రాజాసింగ్. హిందూ అతివాదంతో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదం కాగా పార్టీ అధిష్టానం రాజాసింగ్‌పై కొన్నాళ్లు సస్పెన్షన్ వేటు వేసింది. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఆ సస్పెన్షన్ ఎత్తివేసి మళ్లీ గోషామహల్ నుంచి బరిలోకి దించింది. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కేవలం 8 స్థానాలు మాత్రమే గెలుపొందగా, పార్టీకి పట్టున్న హైదరాబాద్ నగరంలో గోషామహల్ ఒక్కటి మాత్రమే నిలుపుకోగలిగింది. మిగతా 7 స్థానాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల నుంచి సాధించినవే ఉన్నాయి. గెలుపొందినవారిలో రాజాసింగ్ సీనియర్ అయినప్పటికీ శాసనసభాపక్ష నేతగా ఆయనకు పార్టీ అవకాశం ఇవ్వకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటు బరిలో దించి గెలుపొందితే జాతీయస్థాయిలో ఆయన సేవలు వినియోగించుకోవచ్చని పార్టీ భావిస్తోంది. పైగా సింధీ కుటుంబానికి చెందిన రాజాసింగ్‌ను కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం చేయకుండా దేశంలో సింధీల సంఖ్య ఎక్కువగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ప్రచారానికి ఉపయోగించుకోవచ్చని అధిష్టానం భావిస్తోంది. హిందూ ఓట్లను ఏకం చేయడానికి రాజాసింగ్ అభ్యర్థిత్వం ఉపయోగపడినా.. ముస్లిం ఓట్లను చీల్చకపోతే గెలుపు కష్టతరంగా మారుతుంది. అందుకే ముస్లిం ఓట్లను చీల్చేందుకు ఎంఐఎంకు పోటీగా ఎంబీటీ నుంచి బలమైన అభ్యర్థి బరిలోగి దిగేలా కమలం పార్టీ తెరవెనుక పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఆ పార్టీకి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చడంతో పాటు ఇతరత్రా సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా ఓవైసీ బలాన్ని 40 శాతం కంటే తక్కువకు పరిమితం చేయగల్గితే బీజేపీ గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న హిందూ ఓటర్లు పోలింగ్ తేదీన నిరాసక్తత ప్రదర్శించడం కూడా ఓవైసీకి లాభిస్తోందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. ఈసారి ఎన్నికల్లో హిందూ ఓటర్లందరినీ పోలింగ్ బూత్ వరకు తీసుకురాగల్గితే సగం విజయం సాధించినట్టేనని కమలనాథులు వ్యూహరచన చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినప్పటికీ హైదరాబాద్ నగరంలో మాత్రం గెలుపొందలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో త్రిముఖ, బహుముఖ పోటీ నెలకొన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం జాతీయస్థాయిలో ప్రధాన మంత్రిని నిర్దేశించే ఎన్నికలు కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని, హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఆ పోటీ ఎంఐఎం – బీజేపీ మధ్యనే ఉండేలా పరిస్థితులు సృష్టించాలని చూస్తున్నారు. ఇలా బహుముఖ వ్యూహంతో రాష్ట్రంలో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుపొందడంతో పాటు హైదరాబాద్ స్థానాన్ని కూడా తమ ఖాతాలో వేసుకోవాలన్న గట్టి పట్టుదలతో ఉన్నారు.

# కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామనడం కిషన్ రెడ్డి అవివేకం




హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడంతో మాట్లాడటం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రగల్భాలు పలకడంపై ఆయన నిదర్శనమని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ వివేక్ గౌడ్ అన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బిజెపి, 2018 ఎన్నికల్లో ఇక్కడ ఉండి కూడా ఒకే ఒక్క సీటు గెలిచిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వస్తామని ప్రగల్భాలు పలికిన బిజెపి నాయకులు బొక్క బోర్ల పడ్డారని, మళ్లీ రానున్న 17 స్థానాల్లో గెలుస్తామని కిషన్ రెడ్డి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం కాదా? అని సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ – బిఆర్ఎస్ ఒక్కటే అని మాట్లాడుతున్న కిషన్ రెడ్డి లిక్కర్ రాణి ఎమ్మెల్సీ కవితను వదిలిపెట్టబోమని ఢిల్లీలో మీడియా సమావేశం పెట్టి హెచ్చరించిన బిజెపి నాయకులంతా ఎందుకు మౌనంగా ఉన్నారో అందరికీ తెలిసిందే. రాజకీయ లబ్ధి కోసం బేరసారాలతో లిక్కర్ కేసును తాత్కారం చేస్తున్న విషయం జగమెరిగిన సత్యమేనన్నారు. బిజెపి, బిఆర్ఎస్ రహస్య మిత్రులని జగమంతా తెలుసునని, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకిచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసి తీరుతామని సుధాకర్ గౌడ్ అన్నారు. హామీల గారడీతో అధికారంలోకి వచ్చిన బిజెపిని రానున్న ఎన్నికల్లో శంకరగిరి మాన్యాలకు పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. పంటలకు మద్దతు ధర కోరుతూ ఢిల్లీలో మలిదశ ఉద్యమం చేస్తున్న రైతుల పట్ల బిజెపి ప్రభుత్వం ఖర్కశంగా వ్యవహారిస్తున్నదని బండి సుధాకర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న మతతత్వ రైతు వ్యతిరేక బిజెపికి ఓటుతో బుద్ధి చెప్పడానికి దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని బండి సుధాకర్ గౌడ్ మత ఎన్నికలలో ప్రకటించారు.

# హిందూత్వ ప్రాతిపదికన జనాభా విధానం!




న్యూఢిల్లీ,హిందూత్వ ప్రాతిపదికన జనాభా విధానం!వేగంగా జనాభా పెరగడం వల్ల ఎదురయ్యే సవాళ్ళను, జనాభా మార్పులను అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఇటువంటి కమిటీ గురించి బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించడం ఇక్కడ ఆసక్తి రేకెత్తించే అంశం. జనాభా పెరుగుదలపై అధ్యయనం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసి దాని ఆధారంగా కొత్త జనాభా విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావించినట్లైతే, దాని గురించి ప్రస్తావన పార్లమెంట్‌ను ఉద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగంలో వుండాలి.'వేగంగా జనాభా పెరుగుదల' అన్న అంశమే వివాదాస్పదంగా వున్నందున ఇక ఉన్నత స్థాయి కమిటీ ప్రయోజనం కూడా అస్పష్టంగా వుంది. పైగా, జనగణన నిర్వహించనిదే, కమిటీ పరిశీలించడానికి అవసరమైన డేటా ఎక్కడ నుండి వస్తుంది?జనాభా నియంత్రణ, విధాన రూపకల్పనకు సంబంధించి ఇటువంటి చర్య తీసుకోవడానికిగల నేపథ్యాన్ని ఇక్కడ పరిశీలించాల్సి వుంది. 2022 అక్టోబరులో విజయదశమి నాడు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగిస్తూ, జనాభా నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇది అందరికీ సమానంగా వర్తింపచేయాలని కూడా కోరారు. 'మతం ప్రాతిపదికన జనాభా అసమానతల' ముప్పుల గురించి ఆయన హెచ్చరించారు. దీనివల్ల తూర్పు తైమూర్, దక్షిణ సూడాన్, కొసావోల్లో జరిగినట్లుగా కొత్త దేశాల ఏర్పాటుకు దారి తీసే అవకాశం వుందన్నారు. "జనాభా నియంత్రణతో పాటుగా మత ప్రాతిపదికన జనాభా సంతులత కూడా కీలకమైన అంశమే, దాన్ని ఎంత మాత్రమూ నిర్లక్ష్యం చేయరాదు." అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. భగవత్ ప్రసంగాన్ని, ఆర్ఎస్ఎస్ తీసుకువచ్చిన ఇతర సాహిత్యాన్ని చూస్తే సరిహద్దుల ఆవల నుండి చొరబాట్ల వల్ల ఏర్పడుతున్న 'మతపరమైన అసమానత'పై, బలవంతపు మత మార్పిడులపై ప్రతీసారీ ఆర్ఎస్ఎస్ ఇదే వాదన చేస్తోంది. 1951 నుండి 2011 మధ్య కాలంలో 'భారతీయ మూలాలకు' చెందిన మతాలు 88 శాతం నుండి 83.8 శాతానికి పడిపోగా ముస్లిం జనాభా మాత్రం 9.8 శాతం నుండి 14.22 శాతానికి పెరిగిందని భగవత్ తన ప్రసంగంలో చెప్పుకొచ్చారు. మతపరమైన మార్పిడి, చొరబాట్ల కారణంగా మతాల మధ్య అసమానత పెరిగిందని, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా వుందని, దేశ ఐక్యత, సమగ్రత, సాంస్కృతిక గుర్తింపునకు ముప్పుగా పరిణమిస్తోందని ఆర్ఎస్ఎస్ తీవ్రమైన వాదనలు చేస్తూనే వుంది. ఆర్ఎస్ఎస్ వ్యక్తపరుస్తున్న ఈ రకమైన ఆందోళనే%‰%వేగంగా జనాభా పెరుగుదల, జనాభా మార్పులపై అధ్యయనం చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రకటన వెలువడడానికి దారితీసింది. అందువల్ల ఇదేమీ స్వల్పకాలిక ప్రతిపాదనలా కనిపించడం లేదు. పైగా ఈ ఉన్నత స్థాయి కమిటీలో వుండే సభ్యులెవరో చెప్పలేదు. లోక్‌సభ ఎన్నికలలోగా ఆ కమిటీ నివేదిక అందచేస్తుందని కూడా భావించడం లేదు. కాబట్టి కొత్త జనాభా నియంత్రణ విధానమనేది మోడీ మూడవ దఫా పదవీ కాలంలో అమల్లోకి తీసుకురాబోయే ప్రాజెక్టుగా వుంటుందని భావించాల్సి వుంటుంది. ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తున్న మతపరమైన అసమానతలకు, ముస్లిం జనాభా వేగంగా వృద్ధి చెందుతుండడంతో నెలకొన్న భయాందోళనలకు ఎలాంటి శాస్త్రీయమైన డేటా ఆధారం లేదు. 2019-21లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, హిందూ (ఒక్కో మహిళకు 1.94 మంది పిల్లలు), ముస్లిం మహిళ (ఒక్కో మహిళకు 2.36 మంది పిల్లలు)ల్లో సంతానోత్పత్తి రేటులో తేడా కేవలం ఒక్కో మహిళకు 0.42 శాతంగా మాత్రమే వుంది. ముస్లిం మహిళల్లో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గిపోతోంది. 1990-92లో మొదటిసారిగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చేసినపుడు ఇది 3.39గా వుండేది. ఇప్పుడు 2.36కి పడిపోయింది. గత రెండు దశాబ్దాల్లో కనిపించిన ధోరణిని చూసినట్లైతే, హిందువుల్లో సంతానోత్పత్తి రేటు 30 శాతం మేరకు తగ్గగా, ముస్లింలలో 35 శాతం మేర తగ్గింది. వాస్తవానికి, గత 20 ఏండ్లలో చూసినట్లైతే హిందువుల్లో కన్నా ముస్లింలలో జనాభా వృద్ధి రేటు బాగా క్షీణించింది. బహుశా 2030కల్లా హిందూ-ముస్లిం మహిళల సంతానోత్పత్తి రేట్లు ఒకే రీతిలో వుండే అవకాశముంది. జనాభా నియంత్రణపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఆలోచన, కొత్త జనాభా విధానం ఈ రెండూ పరస్పర విరుద్ధమైన ప్రేరణలను కలిగిస్తున్నాయి. ఒకవైపు, హిందూత్వవాదులు జనాభా పెరుగుదలను అరికట్టాలని కోరుకుంటున్నారు. అప్పుడే వర్ధమాన దేశం వనరులు ప్రజల అవసరాలకు సరిపోతాయని భావిస్తున్నారు. నరేంద్ర మోడీ 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తూ 'జనాభా విస్ఫోటనం' తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో, మతపరమైన అసమానతలను అరికట్టేందుకు ముస్లిం జనాభా వృద్ధి రేటును కట్టడి చేయాల్సిన అవసరం వుందంటూ ఆర్ఎస్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌కు సరిహద్దుల్లో గల అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో జనాభా మార్పుల గురించి ఆర్ఎస్ఎస్ ప్రత్యేకంగా ఆందోళన చెందుతోంది. ఉత్తరప్రదేశ్‌లో, కొత్త జనాభా విధానానికి ముందస్తు సూచికను 2021లో ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రకటించింది. 'జనాభా విధానం 2021-2030' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం, వివిధ కమ్యూనిటీల మధ్య జనాభా సమతూకం వుండేలా చూసేందుకు హామీ కల్పించేలా ప్రయత్నాలు చేపడతారు. ఒక్కో కుటుంబానికి ఇద్దరు పిల్లలు వుండేలా ఈ డాక్యుమెంట్‌లో కొన్ని రాయితీలు, ప్రోత్సాహకాలతో ప్యాకేజీ ప్రతిపాదించారు. ప్రభుత్వ పథకాల్లో ముస్లిం లబ్ధిదారుల విషయానికి వస్తే వీటిని ఆదిత్యనాథ్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని భావించవచ్చు. ఇక్కడ హిందూత్వ శక్తుల అసలు బాధ వేగంగా జనాభా పెరగడం గురించి కాదు. చొరబాట్లు, మత మార్పిడులను పరిశీలనలోకి తీసుకుంటే ముస్లిం జనాభా వృద్ధి రేటు అధికంగా వుందని భావించడం. అందువల్లే, హిందూత్వ ప్రాతిపదిక జనాభా విధానాన్ని రూపొందించడానికి కసరత్తు జరుగుతోందని అర్థమవుతోంది. ప్రతి పదేండ్లకోసారి జరగాల్సిన జనాభా లెక్కల నిర్వహణను మోడీ ప్రభుత్వం ఎందుకు చేపట్టలేదో దీనివల్ల అర్థమవుతోంది. 2021లోనే జనగణన జరగాల్సి వుంది. కనీసం 2022లో కోవిడ్ తర్వాతనైనా లేదా 2023లోనైనా చేపట్టాల్సి వుంది. పౌరసత్వ హక్కులు సంపాదించుకోకుండా, భూములు కొనుగోలు చేయకుండా చొరబాటుదారులను నిలువరించేందుకు జాతీయ పౌర రిజిస్టర్‌ను రూపొందించాలని ఆర్ఎస్ఎస్-బీజేపీ జోడీ భావిస్తోంది. జాతీయ జనాభా రిజిస్టర్‌ను ఏర్పాటు చేయడం జాతీయ పౌరుల పట్టికను ఏర్పాటు చేసే దిశగా ప్రాథమిక చర్యగా వుంది. పౌరసత్వ (సవరణ) చట్టాన్ని ఆమోదించే సమయంలో జాతీయ పౌరుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటించింది. 2021 జనగణనలో జాతీయ జనాభా రిజిస్టర్‌ను ఆధునీకరిస్తామని కూడా ప్రకటించింది. అందువల్ల, తాము చెబుతున్న మతపరమైన అసమానతలను అరికట్టేందుకు కొత్త జనాభా నియంత్రణ విధానం ముసుగులో ముస్లిం జనాభాను వారు లక్ష్యంగా చేసుకుంటారు. జాతీయ జనాభా రిజిస్టర్, జాతీయ పౌరుల నమోదు ఆధారంగా మతపరమైన గుర్తింపుపై ఆధారపడి పౌరసత్వంపై అణచివేతలు అమలు చేస్తారు. 'భారతీయేతర' జనాభాను దిగ్గోయాలనే ఆర్ఎస్ఎస్ పథకం పకడ్బందీగా అమలవుతుంది. బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నత స్థాయి కమిటీ ప్రకటన ముసుగులో దాగిన అసలైన ఉద్దేశమిదే.

# ఎగుమతుల్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రాధాన్యత



న్యూఢిల్లీ,భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేస్తూ ఎగుమతులకు తోడ్పాటునందిస్తున్న 'అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా)'లో ఆర్గానిక్ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ప్రపంచంలో ఆరోగ్యకర ఆహార విధానాలపై ఆసక్తి పెరుగుతున్న వేళ రసాయన ఎరువులు వినియోగించకుండా పూర్తిగా సాంప్రదాయ పద్ధతుల్లో సేంద్రీయ పదార్థాలతో పండించిన పంటలకు, వాటి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. సేంద్రీయ వ్యవసాయంలో భారతదేశం ప్రపంచంలోనే ముందు వరుసలో నిలుస్తోంది. ఇక్కడ పండించే సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు దేశీయంగానే కాదు, అంతర్జాతీయంగానూ డిమాండ్ నానాటికీ పెరుగుతోంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం విదేశాలకు వెళ్లినప్పుడు బహుమానంగా భారత సేంద్రీయ ఉత్పత్తులను తీసుకెళ్లి అందజేస్తున్నారు. భారత్‌ను సందర్శించే వివిధ దేశాధినేతలకు సైతం ఆయన ఇచ్చే బహుమతుల్లో భారత ఆర్గానిక్ ఉత్పత్తులు ఉంటున్నాయి. ఆరోగ్యకర సేంద్రీయ వ్యవసాయ విధానాలను, ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న ప్రధాని, ఆ మేరకు 'అపెడా'లో ఆర్గానిక్ డివిజన్ ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. దేశంలో సేంద్రీయ వ్యవసాయంలో హిమాలయ పర్వత రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు ముందు వరుసలో నిలుస్తున్నాయి. గ్లోబల్ ఆర్గానిక్ మార్కెట్లో ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాల ఉత్పత్తుల వాటా గణనీయంగా ఉంది. అయితే ఆర్గానిక్ ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెట్ చేయాలంటే ల్యాబ్ టెస్టులు, సర్టిఫికేషన్ తప్పనిసరి. ఈ ప్రక్రియలో జాప్యం లేకుండా అపెడాలో ఏర్పాటవుతున్న ప్రత్యేక విభాగం తోడ్పాటునందిస్తుంది. సిక్కిం రాష్ట్రం దేశంలోనే పూర్తి సేంద్రీయ వ్యవసాయ రాష్ట్రంగా పేరొందింది. ఈ రాష్ట్రం నుంచి పండించే ప్రతి ఉత్పత్తిని దేశీయంగా, అంతర్జాతీయంగా మార్కెట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్లాలని కేంద్రం భావిస్తోంది. కేవలం ఆర్గానిక్ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడమే కాదు, నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ పథకం ద్వారా సేంద్రీయ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన పెంపొందించడం, సరికొత్త సేంద్రీయ విధానాలను ప్రవేశపెట్టడంలోనూ తోడ్పాటునందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యురోపియన్ యూనియన్ రెగ్యులేషన్‌తో పాటు అంతర్జాతీయ సమాజం నిర్దేశించిన ప్రమాణాలను అందుకుంటూ సేంద్రీయ పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించనుంది. పంటల సాగు ప్రక్రియను జియో-ట్యాగింగ్ చేసి, వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం సహా ప్రతి ఒక్కటీ డిజిటల్ ఐటీ ఎకోసిస్టంలో నమోదయ్యేలా ఏర్పాట్లు కూడా చేస్తోంది. తద్వారా విదేశాల్లో దిగుమతిదారులు, రిటైల్ వినియోగదారుల్లో భరోసా కల్పించవచ్చని భావిస్తోంది.

# ఆస్తిపన్ను బకాయిలపై రాయితీ




హైదరాబాద్,వన్‌టైమ్ సెటిల్మెంట్‌గా ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి నివేదించింది. జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే కనుక దీనిపై దృష్టి సారించాలన్నారు. త్వరలో ముగియనున్న ఈ ర్థికక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 2100 కోట్లు అయినప్పటికీ, గతనెల 20 వరకు రూ.1269 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల్లో ఉంది. నెలనెలా సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకే కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో పలు పర్యాయాలు కల్పించిన ఓటీఎస్ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ స్కీమ్ అమల్లోకి వస్తే ఆస్తిపన్ను బకాయిదారులు అసలుతో పాటు బకాయిల వడ్డీలపై కేవలం 10 శాతం పెనాల్టీ చెల్లిస్తే సరిపోతుంది. అది ఎందరికో వెసులుబాటుగా ఉండటమే కాక జీహెచ్ఎంసీ కష్టాల నుంచి గెటటెక్కేందుకూ ఉపకరిస్తుంది. ఈ అంశాన్ని వివరిస్తూ లేఖ రాశారు. పరిశీలనలోకి తీసుకుని ప్రభుత్వం అవకాశం కల్పించగలదని ఆశిస్తున్నారు. 4,95,628 ప్రైవేట్ యజమానుల భవనాలకు సంబంధించి బకాయిలు రూ.1887.59 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో కలిపి అవి రూ.4522.18 కోట్లకు పేరుకు పోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 1800 భవనాల నుంచి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు రూ. రూ.1622.16 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో సహా అవి రూ.5281.21 కోట్లకు పేరుకుపోయాయి. అన్నీ వెరసి పేరుకు పోయిన మొత్తం బకాయిలు రూ.9803.39 కోట్లు ఉన్నట్లు అంచనా.

# ఉల్లి ఎగుమతుల నిషేధంపై సడలింపు..



హైదరాబాద్,ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉల్లి విదేశీ ఎగుమతులపై గత ఏడాది డిసెంబరు 8 నుంచి అమల్లో ఉన్న నిషేధాన్ని కొంత మేరకు సడలించింది. ఈనెల 31 వరకు బంగ్లాదేశ్, మారిషస్, బహ్రెయిన్, భూటాన్ లకు 54,760 టన్నుల ఉల్లిపాయలను ఎగుమతి చేసేందుకు వ్యాపారులకు అనుమతినిస్తూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బంగ్లాదేశ్ కు 50 వేల టన్నులు, మారిషస్ కు 1200 టన్నులు, బహ్రెయిన్ కు 3 వేల టన్నులు, భూటాన్ కు 560 టన్నులను మార్చి 31 లోపు మాత్రమే ఎగుమతి చేయాలని నిబంధనలు విధించారు. దేశంగా ఉల్లి డిమాండ్-సప్లయ్ ల మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడి ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 31 విదేశాలకు ఉల్లి ఎగుమతులను నిషేధిస్తూ గత ఏడాది డిసెంబరు 8న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలో ఉల్లి ధరలు అదుపులో ఉండటంతో పాటు దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉండటంతో కేంద్ర విదేశాంగ శాఖ విజ్ఞప్తి మేరకు ఉల్లిపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా సడలించినట్టు సమాచారం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com